ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts
సంపుటి - 03 సంచిక -29 పేజీలు - 8 వెల - 03/- శనివారం 16 మే 2026

# రాయలసీమ నుంచి ఫైటర్ జెట్లు



**కేంద్ర మంత్రి రాజ్ నాథ్‌సింగ్‌తో కలిసి ఆమ్కా ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన సీఎం చంద్రబాబు**





- ఆత్మనిర్భర్ లక్ష్యంలో ఆమ్కా ప్రాజెక్టు ముందడుగు
- 36 రోజుల్లో జెట్ స్పీడ్ లో ఈ ప్రాజెక్టుకు అనుమతులు
- ప్రధాని మోదీ ఇచ్చిన పొదుపు ఉద్యమానికి ఏపీ సారధ్యం
- త్వరలో బంగారం ఉత్పత్తికి కేంద్రంగా ఆంధ్రప్రదేశ్
- ఏపీ అంటే అడ్వాన్స్డ్‌ప్రదేశ్ : రాజ్‌నాథ్ సింగ్ కితాబు

**పుట్టపర్తి, ప్రతినిధి, మే 15, (రిపబ్లిక్ న్యూస్ ):**
దేశం గర్వించే రక్షణ కేంద్రంగా పుట్టపర్తి తయారుకాబోతందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో 650 ఎకరాల్లో అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రాజెక్టు నిర్మాణానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు

మిగతా 2లో.





# పెట్రో బాంబ్

**లీటర్‌కు సగటున రూ.3 పెంపు**

- సీఎన్‌జీ కిలోకు రూ. 2 పెరుగుదల
- పెట్రోల్, డీజిల్ పై ధరల బాదుడు
- నోట్ల రద్దులానే చమురు పిడుగు

**తెలంగాణలో పెట్రోల్ పై రూ.3.39, డీజిల్‌పై రూ.3.26 వాత**
**ఏపీలో పెట్రోల్‌పై రూ.3.29, డీజిల్‌పై రూ.3.14 పెంపు**
**దేశ ప్రజలపై మరో భారం మోపిన మోడీ సర్కారు**

న్యూఢిల్లీ **మే 15 రిపబ్లిక్ న్యూస్.**
దేశ ప్రజలకు కేంద్ర ప్రభుత్వం భారీ షాకిచ్చింది. సామాన్యుడిపై పెట్రోల్, డీజిల్ బాదుడుకు ఉపక్రమించింది. ఐదు రాష్ట్రాల్లో ఎన్నికల ప్రక్రియ ముగిసిన తరువాత మోడీ సర్కార్ పెట్రోల్, డీజిల్ ధరలను పెంచింది. లీటర్ పెట్రోల్, డీజిల్‌పై రూ.3కు పైగా పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. అలాగే సీఎన్‌జీ ధరలు కూడా కిలోకు రూ. 2 చొప్పున పెంచింది. ఈ ధరలు శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి అమల్లోకి వచ్చాయి. ఈ విషయాన్ని ఆయిల్ కంపెనీలు స్పష్టం చేశాయి. దాంతో దేశంలోని ప్రధాన మెట్రో నగరాల్లో వీటి ధరలు మారాయి.

మిగతా 2లో.

# నాడు కియా.. నేడు ఫైటర్ జెట్..



**అనంతకు చంద్రబాబు రిటర్న్ గిఫ్ట్: మంత్రి లోకేశ్**


- ఉమ్మడి అనంతపురం చరిత్రను మార్చే ప్రాజెక్టు అని మంత్రి లోకేశ్ వ్యాఖ్య
- నాడు కియా కార్లు, నేడు ఫైటర్ జెట్లు చంద్రబాబు వల్లేనని వెల్లడి
- వాళ్లది ఫ్యాక్షన్, మనది ఫైటర్ జెట్ అంటూ విపక్షాలపై చురకలు
- ఈ ప్రాజెక్టుతో రాయలసీమ యువతకు భారీగా ఉద్యోగ అవకాశాలు

**పుట్టపర్తి, ప్రతినిధి, మే 15, (రిపబ్లిక్ న్యూస్ ):**
ఉమ్మడి అనంతపురం జిల్లా చరిత్రను మార్చే బృహత్తర ఘట్టానికి పుట్టపర్తిలో అంకురార్పణ జరిగిందని, ఏఎంసీఏ (అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్) ప్రాజెక్టుతో ఈ ప్రాంతం భారతదేశ రక్షణ రంగంలో కొత్త శక్తి కేంద్రంగా మారబోతోందని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. పుట్టపర్తిలో ఏఎంసీఏ స్టెల్త్ ఫైటర్ జెట్ ప్రాజెక్టు భూమిపూజ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టు ద్వారా రానున్న పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు.గత ఎన్నికల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా 14కి 14 స్థానాల్లో ఎన్డీఏ కూటమిని గెలిపించిందని, దానికి రిటర్న్ గిఫ్ట్‌గా ఈ ప్రాజెక్టును

మిగతా 2లో.

# పార్టీ కార్యకర్తల స్వేదం మరచిపోలేనిది

- ఆటుపోట్లు తట్టుకుంటేనే పార్టీని నడపగలం
- ఒంటరి పోరాటం చేసి దెబ్బతిన్న విషయం మరవద్దు
- పార్టీ శ్రేణులతో జనసేనాని పవన్ కళ్యాణ్



**అమరావతి, మే 15 రిపబ్లిక్ న్యూస్.** :ఎన్నో ఆటుపోట్లు తట్టుకుంటేనే పార్టీని నడపగలమని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. పక్క రాష్ట్రంలో ఒకరు పార్టీ పెట్టి సీఎం అయ్యారని, తాను కూడా అలా వెళ్తే బాగుండేదని అనేక మంది సలహాలు ఇస్తున్నారని.. కానీ ఏపీలో పరిస్థితులు వేరనే విషయాన్ని వాళ్లు తెలుసుకోవాలని వ్యాఖ్యానించారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో 'జనసేన ఉద్యమ ఆత్మీయ సమావేశం' నిర్వహించారు.

మిగతా 2లో.

# ఆన్ లైన్ లో మహానాడు!

- నెల్లూరులో మహానాడు నిర్వహణకు ఇప్పటికే ముమ్మర ఏర్పాట్లు
- మోదీ పిలుపు నేపథ్యంలో చంద్రబాబు కీలక నిర్ణయం
- హైబ్రిడ్ విధానంలో రెండ్రోజుల పాటు టీడీపీ మహానాడు
- ఎన్టీఆర్ భవన్ లో స్టేజి ఏర్పాటు... రాష్ట్రవ్యాప్తంగా స్క్రీన్లపై ప్రసారం



2లో.

# మళ్లీ నీట్ పరీక్ష

**జూన్ 21న ఎగ్జామ్ నిర్వహణకు తేదీ ఖరారు**
**వివరాలు వెల్లడించిన ఎన్‌టిఏ**





**న్యూఢిల్లీ, మే 15 రిపబ్లిక్ న్యూస్.**
ప్రశ్నపత్రం లీక్ ఆరోపణలతో రద్దయిన నీట్ యూజీ 2026 పరీక్షను మళ్లీ నిర్వహించేందుకు షెడ్యూల్ ఖరారైంది. జూన్ 21న, ఆదివారం ఈ పరీక్ష జరగనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ శుక్రవారం వెల్లడించింది. ఈ మేరకు ఎన్‌టీఏ తమ ఎక్స్ ఖాతాలో పోస్ట్

మిగతా 2లో.

# 2034 వరకు నేనే ముఖ్యమంత్రిని

- ఆ తరవాత జాతీయ రాజకీయాల్లోకి వెళతా
- రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యంగా పనిచేస్తా
- రాహుల్ తరవాత సెకండ్ ప్లేస్ ఆక్రమిస్తా
- సిఎం రేవంత్ రెడ్డి మరోమార్ సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్, మే 15 రిపబ్లిక్ న్యూస్.**
తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. 2034లో రాష్ట్రంలో కాంగ్రెస్‌ను గెలిపించి జాతీయ రాజకీయాల్లోకి వెళ్తానని చెప్పారు. అప్పటి వరకు తానే సీఎంగా ఉంటానన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే తన లక్ష్యమని చెప్పారు. జాతీయ రాజకీయాల్లోకి వెళ్లి రాహుల్ తర్వాతి స్థానంలో ఉంటానని వ్యాఖ్యానించారు. దేశంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడమే రాహుల్ గాంధీ లక్ష్యమన్నారు. ఆయనకు ప్రధాని కావాలనే కోరిక లేదని.. ఆ పదవికి పోటీ పడాలని తాను ఒప్పించానని రేవంత్ చెప్పారు. గాంధీ కుటుంబానికి దేశం పట్ల విశ్వాసం ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

మిగతా 2లో.

# రూపాయి విల విల

**అత్యంత అధ్వాన్నస్థితిలోకి రూపాయి**
**తొలిసారిగా డాలర్@96**



2లో.

# రాయలసీమ నుంచి ఫైటర్ జెట్లు





**మొదటిపేజీ తరువాయి**

చేసిన సభలో చంద్రబాబు మాట్లాడారు. పుట్టపర్తి అనగానే సత్యసాయిబాబా గుర్తొస్తారు. తన బోధనలతో విశ్వశాంతికి కృషి చేశారు.రాయలసీమ ఒకప్పుడు డ్రాట్ జోన్ అని.. ఇప్పుడు గ్రోత్ జోన్‌గా మారిందన్నారు. ఒకప్పుడు గోల్డ్ అంటే కేజీఎఫ్ గుర్తొచ్చేదని.. ఇకపై జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్స్ అని చెప్పుకుంటారని తెలిపారు. ఈ ఏడాది జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్స్‌లో 600 కిలోల బంగారం ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్స్‌లో 1,500 కిలోల బంగారం ఉత్పత్తి చేస్తామన్నారు. బంగారం ఉత్పత్తికి చిరునామాగా ఏపీ నిలవనుందని చెప్పుకొచ్చారు. ఆపరేషన్ సిందూర్ భారతీయులకు గర్వకారణం. ఇప్పుడు అడ్వాన్స్డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రాజెక్టు రావడం ఎంతో కీలకమన్నారు. ఏఎంసీఏ ప్రాజెక్టు ద్వారా ఆత్మనిర్భర్ భారత్ లక్ష్య సాధనలో ఆంధ్రప్రదేశ్ ముఖ్య పాత్ర పోషిస్తుందని చంద్రబాబు తెలిపారు. ఆధునిక స్టెల్త్ యుద్ధ విమానాల తయారీకి ఈ ప్రాజెక్టు దోహదపడుతుందన్నారు. భారత రక్షణ శక్తిని ప్రపంచానికి చాటడంలో ఆపరేషన్ సిందూర్ ఓ ప్రత్యక్ష ఉదాహరణగా నిలిచిందని సీఎం తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌లో వినియోగించిన డ్రోన్లు ఏపీలోనే తయారు చేసి పరీక్షించారని చెప్పారు. ఈ ప్రాజెక్టును ఏపీకి కేటాయించినందుకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా రూ.15 వేల కోట్లకు పైగా పెట్టుబడితో 7,500 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఫైటర్ జెట్ ఇంటిగ్రేషన్‌తో పాటు పైలట్ టెస్టింగ్ కేంద్రంగా పుట్టపర్తి అభివృద్ధి చెందుతుందన్నారు. కేవలం 36 రోజుల్లోనే ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయగలిగామని.. జెట్ స్పీడ్‌తో అనుమతులు ఇచ్చామని తెలిపారు. ఏరోస్పేస్ రంగంలో ఈ కీలక ప్రాజెక్టుతో మరిన్ని డిఫెన్స్ ప్రాజెక్టులు రాబోతున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్ ఫోర్జ్, హెచ్‌ఎఫ్‌సీఎల్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్‌తో కర్నూలు జిల్లాలో డ్రోన్ సిటీలకు శంకుస్థాపన చేశామని తెలిపారు. ఓర్వకల్లులో డ్రోన్ సిటీ ఏర్పాటు చేసి ఉత్పత్తి ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. శ్రీహరికోట అంతరిక్ష శక్తి, నాగాయలంక క్షిపణి శక్తి, పుట్టపర్తి రక్షణ శక్తి, విశాఖ నౌకాదళ శక్తిగా ఏపీ దేశానికి అండగా నిలుస్తుందని సీఎం అన్నారు. కడప స్టీల్ ప్లాంట్ పనులను జూన్‌లో ప్రారంభిస్తామని ప్రకటించారు. 2028 నాటికి కడప స్టీల్‌ఎ÷–లాంట్‌ను పూర్తిచేస్తామన్నారు. నాడు ఎన్టీఆర్, నేడు కూటమి ప్రభుత్వం రాయలసీమకు నీరిచ్చేందుకు కృషి చేస్తోందన్నారు. ప్రతి ఎకరాకు నీరు అందించేందుకు కృషి చేస్తున్నామని చంద్రబాబు పేర్కొన్నారు. కర్నూలు జిల్లాలో డ్రోన్ సిటీ ద్వారా భారతదేశంలోనే ఆధునిక డ్రోన్ ఎకో సిస్టమ్‌కు శ్రీకారం చుట్టాం. రూ.686 కోట్లతో 8 సంస్థలు ఏర్పాటు కాబోతున్నాయి. వీటి ద్వారా 2,500 మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయి. ఒకప్పుడు రాయలసీమ అంటే రతనాల సీమ. ఒకానోక దశలో అనంతపురం ఎడారిగా మారిపోయింది. రాయలసీమ రూపు రేఖలు పూర్తిగా మార్చిన ఘనత ఎన్టీఆర్‌ది. సీమకు నీళ్లు తీసుకురావాలి, ప్రజల జీవితాలను మార్చాలని ఎన్టీఆర్ సంకల్పించారు. ఆయన శ్రీకారం చుట్టిన ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నాం. సమర్థ నీటి నిర్వహణతో సీమకు జలహారతి ఇచ్చాం. కేంద్రం సహకారంతో రాయలసీమ రూపు రేఖలు మారబోతున్నాయి. రాయలసీమను మళ్లీ రతనాలసీమ చేసే బాధ్యతను ఎన్డీఏ ప్రభుత్వం తీసుకుంటుంది. కడప స్టీల్‌ప్లాంట్ పనులు జూన్‌లో ప్రారంభించి 2028 నాటికి నిర్మాణం పూర్తి చేసి రాయలసీమకు కానుకగా ఇస్తాం. దేశానికి ఏపీ రక్షణకవచంగా నిలబడుతోంది. ఒకప్పుడు గోల్డ్ అంటే కేజీఎఫ్.. ఇప్పుడు జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్. ఈ ఏడాది జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్‌లో 600 కిలోలు, వచ్చే ఏడాది 1500 కిలోల బంగారం ఉత్పత్తి చేస్తాం. బంగారం ఉత్పత్తికి చిరునామాగా ఆంధ్రప్రదేశ్ మారబోతోందని సీఎం అన్నారు.





## యుద్ధరంగంలో డ్రోన్ టెక్నాలజీ గేమ్ ఛేంజర్

**కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్**

యుద్ధరంగంలో డ్రోన్ టెక్నాలజీ గేమ్ ఛేంజర్ అని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ వ్యాఖ్యానించారు. ఆర్థిక, వ్యవసాయ శాఖల్లో డ్రోన్ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. ఏపీలో రూ.480 కోట్లతో భారత్ డైనమిక్స్ లిమిటెడ్ ప్రారంభిస్తున్నామని చెప్పుకొచ్చారు. శుక్రవారం పుట్టపర్తిలో కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, సీఎం చంద్రబాబు పర్యటించారు. పుట్టపర్తిలో యుద్ధ విమానాల తయారీ పరిశ్రమకు శంకుస్థాపన చేశారు. రూ.15,803 కోట్లతో ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టారు. పుట్టపర్తి – కోడూరు రోడ్డులోని 130 ఎకరాల విస్తీర్ణంలో డిఫెన్స్ పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్‌సింగ్ మాట్లాడారు. ఆయుధ ఉత్పత్తిలో స్వావలంబన దిశగా భారత్ అధ్యయనం చేస్తోందని తెలిపారు. రక్షణ శాఖలో సంపూర్ణ స్వావలంబన సాధించాలనేది కేంద్ర లక్ష్యమని ఉద్ఘాటించారు. గత పదేళ్లలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల మధ్య అంతరం తగ్గించడానికి కృషి చేస్తున్నామని చెప్పుకొచ్చారు. డ్రోన్ హబ్‌గా కర్నూలు ఉంటుందని స్పష్టం చేశారు. ఆ దిశగా ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని రాజ్‌నాథ్‌సింగ్ పేర్కొన్నారు. పబ్లిక్, ప్రైవేటు రంగాలు చేయిచేయి కలిపి నడుస్తున్నాయని తెలిపారు. గత పదేళ్లలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల మధ్య అంతరాన్ని తగ్గించామన్నారు. 'యుద్ధ రంగంలో డ్రోన్ టెక్నాలజీ ఒక గేమ్ ఛేంజర్‌గా నిలిచింది. 8 డ్రోన్ కంపెనీలు కలిసి కర్నూలులో డ్రోన్ సిటీ ప్రారంభానికి సిద్ధమయ్యాయి. ఇక నుంచి కర్నూలును డ్రోన్ హబ్‌గా పిలుస్తారు. ఆర్థిక వ్యవస్థ, వ్యవసాయరంగంలో కూడా డ్రోన్ పాత్ర కీలకంగా మారింది. హెచ్‌ఎఫ్‌సీఎల్ రూ.1294 కోట్ల పెట్టుబడితో రాబోతోంది. ఆయుధాల తయారీ రంగంలో స్వావలంబన దిశగా కొత్త అధ్యాయం ప్రారంభం కాబోతోంది. యుద్ధసమయంలో సొంత భద్రత కోసం ఇతర దేశాలపై ఆధారపడాల్సి వచ్చేది. కొన్నేళ్ల క్రితం రక్షణరంగంలో ప్రపంచంలోనే అతిపెద్ద దిగుమతిదారుగా ఉండేవాళ్లం. ఇప్పుడు పరిస్థితులు మారాయి.. గత పదేళ్లుగా చేసిన కఠోర శ్రమకు ఫలితాలు వస్తున్నాయి. 2004లో కేవలం భారత్ రూ.46వేల కోట్ల విలువైన ఆయుధ పరికరాల తయారీ ఉండేది. ప్రస్తుతం రికార్డు స్థాయిలో రూ.1.75లక్షల కోట్లకు చేరిందని గర్వంగా చెబుతున్నాం' అని అన్నారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు లోకేశ్, అనగాని సత్యప్రసాద్, టీజీ భరత్, సత్యకుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# 2034 వరకు నేనే ముఖ్యమంత్రిని

**మొదటిపేజీ తరువాయి**

వ్యాఖ్యానించారు.. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తనకు చాలా చొరవ ఉందని పేర్కొన్నారు. తన గీత తాను దాటనని స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్ వేదికగా సీఎం మాట్లాడారు. టీడీపీలో పదేళ్లు పనిచేశానని.. సీఎం చంద్రబాబు ఇప్పటికి తనను గౌరవిస్తారని ప్రస్తావించారు. పార్టీని వదిలిపెట్టిన తర్వాత నాయకుల మధ్య మంచి సంబంధాలు ఉండటం చాలా అరుదని తెలిపారు.. పార్టీని వదిలిపెట్టే సమయంలో విజయవాడకు వెళ్లి చంద్రబాబుకు చెప్పి వచ్చానని గుర్తుచేశారు.. కాంగ్రెస్‌ను దేశంలో అధికారంలోకి తేవాలని రాహుల్ గాంధీకి లక్ష్యం ఉందని...కాని ప్రధాని కావాలన్న లక్ష్యం లేదని స్పష్ట చేశారు. వికారాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో ప్రధాని పదవి తీసుకోవాలని తానే రాహుల్ గాంధీకి చెప్పి ఒప్పించానని ప్రస్తావించారు. ఇప్పుడు జనం స్విగ్గి పాలిటిక్స్ కోరుకుంటున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇండియా కూటమి నుంచి ప్రధాని అభ్యర్థి రాహుల్ గాంధీనే అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ముందు ప్రకటించి తర్వాత ఇండియా కూటమిని ఒప్పిస్తామని తెలిపారు. ఇండియా కూటమి తరుపున ఒక పాలసీ డాక్యూమెంటును తీసుకువచ్చి ప్రజలను తీర్పు ఇవ్వమని కోరతామని అన్నారు. 2024 నుంచి 2034 వరకు కాంగ్రెస్‌కు అధికారం ఇస్తారని చెప్పుకొచ్చారు.. 2034 వరకు తాను తెలంగాణలోనే ఉంటానని.. ఈ ప్రజల కోసమే పనిచేస్తానని తెలిపారు. పదిశాతం జీడీపీని తెలంగాణ దేశానికి ఇచ్చేలా పనిచేస్తానని స్పష్టం చేశారు. 2034 వరకు తానే ముఖ్యమంత్రినని చెప్పుకొచ్చారు. 2034 తర్వాత తాను ముఖ్యమంత్రిగా ఉండనని.. తర్వాత తరానికి అవకాశం ఇస్తానని తెలిపారు. దేశానికి కూడా సేవలందిస్తా అని.. తన అనుభవాన్ని దేశం కోసం పంచుతానని చెప్పుకొచ్చారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేసిన తర్వాత.. ఆయన ఏ బాధ్యతలు అప్పగించిన తీసుకుంటానని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# నాడు కియా.. నేడు ఫైటర్ జెట్..

**మొదటిపేజీ తరువాయి**

అందిస్తున్నామని లోకేశ్ పేర్కొన్నారు. "నాడు కరవు నేలపై కియా కార్లు పరిగెత్తించిన విజనరీ చంద్రబాబు. నేడు అదే పుణ్యభూమిపై ఫైటర్ జెట్లు ఎగిరేలా చేస్తున్నది కూడా ఆయనే. భగవాన్ శ్రీ సత్యసాయిబాబా ఆశీస్సులతో ఈ ప్రాంతం అభివృద్ధి పథంలో పయనిస్తోంది" అని ఆయన అన్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం నారా చంద్రబాబు నాయుడుల 'నమో జోడి' వల్లే రాష్ట్రానికి లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని లోకేశ్ తెలిపారు. "రూ.1.35 లక్షల కోట్ల గూగుల్ డేటా సెంటర్, రూ.1.35 లక్షల కోట్ల ఆర్సెలార్ మిట్టల్ పెట్టుబడులతో పాటు ఇప్పుడు పుట్టపర్తిలో లక్ష కోట్ల ఏఎంసీఏ ప్రాజెక్టు వచ్చింది. పోలవరం, అమరావతికి నిధులు, విశాఖ ఉక్కు పరిరక్షణ, విశాఖ రైల్వే జోన్, కర్నూలుకు హైకోర్టు బెంచ్ వంటివన్నీ ఈ పవర్‌ఫుల్ కాంబినేషన్‌తోనే సాధ్యమయ్యాయి" అని వివరించారు. ఏపీలో ఉన్నది డబుల్ ఇంజన్ సర్కార్ కాదని, డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ అని ఆయన అభివర్ణించారు. డీఆర్‌డీఓ, ఏడీఏ, హాల్ వంటి సంస్థల భాగస్వామ్యంతో ఏర్పాటవుతున్న ఈ ప్రాజెక్టుతో 5వ తరం స్టెల్త్ ఫైటర్ జెట్లను ఇక్కడ తయారు చేస్తారని లోకేశ్ తెలిపారు. భారత్ ఫోర్జ్, భారత్ డైనమిక్స్ వంటి అనేక దిగ్గజ కంపెనీలు ఇక్కడ పెట్టుబడులు పెట్టనున్నాయని, తద్వారా ఈ ప్రాంత యువతకు వేల సంఖ్యలో ఉద్యోగాలు లభిస్తాయన్నారు. "ఒక్క కియా పరిశ్రమతోనే అనంతపురం ఎంతో అభివృద్ధి చెందింది. ఇప్పుడు ఏఎంసీఏ ప్రాజెక్టుతో ఉమ్మడి అనంతపురం జిల్లా అభివృద్ధిలో నంబర్ వన్ కావడం ఖాయం" అని ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు సాధన కోసం సీఎం చంద్రబాబు, పరిశ్రమల మంత్రి టీజీ భరత్ ప్రత్యేకంగా కృషి చేశారని గుర్తుచేశారు.

ఈ సందర్భంగా ప్రతిపక్షాలపై తనదైన శైలిలో చురకలంటించిన లోకేశ్, "వాళ్లది ఫ్యాక్షన్ బ్యాక్‌గ్రౌండ్, మనది ఫైటర్ జెట్ బ్యాక్‌గ్రౌండ్. వాళ్లది కిడ్నాప్ బ్యాక్‌గ్రౌండ్, మనది కియా బ్యాక్‌గ్రౌండ్. రెండిటికీ చాలా తేడా ఉంది. అర్థమైందా రాజా?" అంటూ తన ప్రసంగాన్ని ముగించారు. రాష్ట్రానికి ఈ ప్రాజెక్టును కేటాయించినందుకు ప్రధాని మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌లకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# పార్టీ కార్యకర్తల స్వేదం మరచిపోలేనిది

**మొదటిపేజీ తరువాయి**

ఈ సమావేశానికి పవన్ హాజరై మాట్లాడారు. ఒంటరిగా వెళ్లి దెబ్బతిన్నాం.. నేనూ రెండు చోట్లా ఓడిపోయా. జనసేన పార్టీకి మూలస్తంభం కార్యకర్తలే. కుటుంబం నడిపే పార్టీగా ఉండకూడదని కోరుకుంటున్నానని పవన్ అన్నారు. ఈ సందర్భంగా వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై పవన్ కల్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమిళనాడు సీఎం విజయ్‌తో పోల్చి తనను వైసీపీ నేతలు విమర్శలు చేయడంపై పవన్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. దశాబ్దం కాలం పాటు నలిగిపోయి, ఫ్యాక్షన్ రాజకీయాలు తట్టుకుని ఇక్కడి వరకు వచ్చామని వ్యాఖ్యానించారు. ఈ మధ్యన పక్క రాష్ట్రంలో ఒక వ్యక్తి పార్టీ పెట్టి సీఎం అవగానే తనతో పోలిక పెట్టారని తెలిపారు. ఊర్లో పెళ్లికి ఏదో హడావుడి అన్నట్లుగా ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. మన ఊర్లో పెళ్లి జరుగుతుంటే. చిన్నపిల్లలు పరుగులు పెడుతుంటారని.. అలా ఉంది వారి ప్రచారమని ఎద్దేవా చేశారు. ఏపీలో ఉన్న రాజకీయ పరిస్థితులు వేరని.. అక్కడి పరిస్థితులు వేరని పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు. 2019లో తాను పోటీ చేస్తే రెండు చోట్లా ఓడించారని.. దీంతో తనతో ఉన్న నాయకులు వెళ్లిపోయారని ప్రస్తావించారు. పొంతన లేని పోలికలు పెట్టి.. ప్రచారం చేయడం మానుకోవాలని వైసీపీ నేతలకు హితవు పలికారు. కమ్యూనిస్టులు పార్టీ పెట్టి ఎన్నో దెబ్బలు తిని నిలబడ్డారని ప్రస్తావించారు. అదేవిధంగా ఒక రాజకీయ పార్టీ నడపడం అంటే అంత ఈజీ కాదని తెలిపారు. 2007 నుంచి 2018 వరకు దశాబ్దం పాటు తాను ఇబ్బంది పడ్డానని పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు. దెబ్బతినకుండా ఏదీ రాదని.. 2024కి అధికారంలో భాగస్వామ్యం అయ్యామని తెలిపారు. ఈరోజున అందరూ తనను వదిలేసినా.. తాను పార్టీని ముందుకు తీసుకెళ్తున్నానని స్పష్టం చేశారు. కార్యకర్తల నుంచి బలమైన నాయకత్వం తనకు రావాలని కోరుతున్నానని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కేవలం ఒక సంఖ్య కాదని, అది పార్టీ విలువలను, అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ఒక గొప్ప యజ్ఞమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. అమరావతిలో జరిగిన పార్టీ కార్యక్రమంలో ఆయన పాల్గొని, జనసైనికులను ఉద్దేశించి ఉద్వేగభరిత ప్రసంగం చేశారు. జనసేన పార్టీ ఆవిర్భావం నుండి నేటి వరకు కార్యకర్తలు పడుతున్న కష్టాన్ని, పార్టీ ఇస్తున్న భరోసాను ఆయన వివరించారు. పార్టీ సభ్యత్వ నమోదుపై నాదెండ్ల మనోహర్ కీలక గణాంకాలను వెల్లడించారు. 2024 ఎన్నికల తర్వాత జనసైనికులు ఎంతో బలంగా నిలబడి 12 లక్షల 12 వేల సభ్యత్వాలు చేశారని గుర్తు చేశారు. ఈ ఏడాది పార్టీ 25 లక్షల సభ్యత్వాలను లక్ష్యంగా పెట్టుకోగా, క్షేత్రస్థాయిలో జనసైనికుల కృషి వల్ల ఇప్పటికే 21 లక్షల 50 వేల సభ్యత్వాలు పూర్తి కావడం విశేషమని ఆయన కొనియాడారు. ఏటా సభ్యత్వాల సంఖ్య గణనీయంగా పెరుగుతుండటం పార్టీ పట్ల ప్రజల్లో ఉన్న ఆదరణకు నిదర్శనమని చెప్పారు. కష్టకాలంలో పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు జనసేన ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మనోహర్ భరోసా ఇచ్చారు. 2020లో సభ్యత్వ నమోదు ప్రారంభించినప్పటి నుండి దురదృష్టవశాత్తూ 1,034 మంది జనసైనికులు ప్రాణాలు కోల్పోయారు. పార్టీ సభ్యత్వం ఉండి మరణించిన వారందరికీ కలిపి ఇప్పటి వరకు రూ. 46 కోట్ల 35 లక్షలను చెక్కుల రూపంలో వారి కుటుంబాలకు అందజేశాం అని ఆయన వివరించారు. రాజకీయాల్లో కష్టాలు, సమస్యలు సహజమని, కానీ జనసేన ఎప్పుడూ తన సిద్ధాంతాలకు కట్టుబడే ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు.

# రూపాయి విల విల

## అత్యంత అధ్వానస్థితిలోకి రూపాయి

## తొలిసారిగా డాలర్@96

**ముంబయి మే 15 రిపబ్లిక్ న్యూస్. :** అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ అత్యంత అధ్వానస్థితిలోకి జారుకుంది. చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా ప్రధాని మోడీ హయాంలో ఆల్‌టైం కనిష్ట స్థాయికి పడిపోయింది. ముడి చమురు ధరలు నిరంతరం పెరగడం, ద్రవ్యోల్బణ ఆందోళనలు, వాణిజ్యలోటు పెరగడం, విదేశీ మారకం నిల్వలు తగ్గడం, ఎఫ్‌డిఐలు పడిపోవడం తదితర కారణాలతో శుక్రవారం ఇంట్రాడేలో డాలర్‌తో పోల్చితే రూపాయి ఏకంగా 96.14 స్థాయికి పడిపోయింది. ఆ తర్వాత రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) జోక్యంతో కొంత కోలుకుని చివరికి 30 పైసలు నష్టపోయి 95.94కు పరిమితమైంది. గత ఆరు ట్రేడింగ్ సెషన్లలోనే రూపాయి విలువ దాదాపు 2 శాతం మేర క్షీణించింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు రూపాయి మొత్తం 6 శాతానికి పైగా నష్టపోయింది. వారాంతం సెషన్‌లో బిఎస్ఇ సెన్సెక్స్ 160.73 పాయింట్లు నష్టపోయి 75,237.99 వద్ద ముగిసింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ కూడా 46.10 పాయింట్లు తగ్గి 23,643.50 వద్ద నమోదైంది.

# పెట్రో బాంబ్

**మొదటిపేజీ తరువాయి**

**ధరల పెరుగుదల ఇలా..**

రెండు తెలుగు రాష్ట్రాల్లో లీటర్ పెట్రోల్, డీజీల్‌లపై రూ.3కు పైగా ధరలు పెరిగాయి. హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్‌పై రూ.3.39, డీజీల్‌పై రూ.3.26 వరకు ఎగబాకాయి. దీంతో ఇక్కడ లీటర్ పెట్రోల్ ధర రూ.110.89, డీజీల్ ధర రూ.98.96కి చేరింది. పెరిగిన దరలతో దేశ రాజధాని న్యూఢిల్లీలో పెట్రోల్ ధర లీటరుకు రూ. 94.77 నుంచి రూ. 97.77కు పెరిగింది. అలాగే డీజిల్ ధర రూ. 87.67 నుంచి రూ. 90.67కు ఎగబాకింది. కోల్‌కతాలో పెట్రోల్ రూ.108.74, డీజిల్ రూ.95.13గా ఉంది. ముంబయిలో పెట్రోల్ లీటర్ ధర రూ.106.68, డీజిల్ రూ.93.14 గా ఉంది. చెన్నైలో పెట్రోల్ లీటర్ ధర రూ.103.67, డీజిల్ ధర రూ.95.25గా నమోదైంది.

**ఇతర రంగాలపై ప్రభావం : ఆర్థిక నిపుణులు**

పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల పెరుగుదల కారణంగా ఆయిల్ కంపెనీలపై భారం పడుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టుగా కేంద్ర ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. కానీ ప్రధాని మోడీ పొదుపు మంత్రం పాటించాలని చెప్పిన రెండు మూడు రోజుల్లోనే ఈ ధరలు పెరగడం ఇప్పుడు చర్చనీయాం శంగా మారింది. ఇప్పుడు ఇంధన ధరల పెంపుతో రవాణా ఖర్చులు పెరిగే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు చెప్తున్నారు. ఫలితంగా నిత్యవసర వస్తువుల ధరలు, ప్రయాణ చార్జీలు పెరగడంతో పాటు దేశంలోని తదితర రంగాలపై దీని ప్రభావం పడే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. కాగా 2024 మార్చి నుంచి పెట్రోల్, డీజిల్ ధరల్లో ఎటువంటి మార్పు లేదు.లోక్‌సభ ఎన్నికలకు ముందు మార్చి 2024లో పెట్రోల్, డీజిల్ రెండింటిపై లీటరుకు రూ. 2 చొప్పున కేవలం ఒక్కసారి మాత్రమే ధరల తగ్గింపు జరిగింది. మరో వైపు నయారా, షెల్ వంటి ప్రయివేట్ రిఫైనరీలు, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు.. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ మాసాల్లోనే పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిన సంగతి తెలిసిందే. అయితే, పశ్చిమ ఆసియా సంఘర్షణ కారణంగా ప్రపంచ చమురు ధరలు 50 శాతానికి పైగా పెరిగాయి. యుద్ధానికి ముందు ఫిబ్రవరిలో బ్యారెల్‌కు సగటున 69 అమెరికన్ డాలర్లుగా ఉన్న దేశ ముడి చమురు దిగుమతి ధరల సగటు, తర్వాతి నెలల్లో బ్యారెల్‌కు 113114 అమెరికన్ డాలర్లకి పెరిగింది.

# మళ్లీ నీట్ పరీక్ష

**మొదటిపేజీ తరువాయి**

చేసింది. రీఎగ్జామ్‌కు సంబంధించి అధికారిక మార్గాల్లో వచ్చే సమాచారాన్నే విశ్వసించాలని విద్యార్థులను ఎన్‌టీఏ కోరింది. హాల్‌టికెట్, ఇతరత్రా వివరాలను త్వరలోనే వెల్లడించనుంది. దేశవ్యాప్తంగా వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ తదితర కోర్సుల్లో ప్రవేశాల కోసం మే 3వ తేదీన జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష–యూజీని (నీట్–యూజీ) నిర్వహించిన సంగతి తెలిసిందే. దేశంలోని 551 నగరాలు, విదేశాల్లోని 14 నగరాల్లో ఈ పరీక్ష జరిగింది. అయితే, ఈ పరీక్ష ప్రశ్నపత్రాలు కొన్నిచోట్ల లీకయ్యాయని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో నాటి పరీక్షను రద్దు చేస్తున్నట్లు ఎన్‌టీఏ ప్రకటించింది. దీంతో దేశవ్యాప్తంగా ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న 23 లక్షల మంది మళ్లీ పరీక్ష రాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాగా.. రీఎగ్జామినేషన్‌కు మరోసారి దరఖాస్తు చేసుకోనక్కర్లేదని, ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని ఎన్‌టీఏ స్పష్టం చేసింది. ఇదిలాఉండగా.. నీట్ పేపర్ లీక్‌పై సీబీఐ దర్యాప్తు కొనసాగుతోంది. ఇప్పటికే పలువురు కీలక నిందితులను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. రాజస్థాన్‌లోని సికార్‌లో ఈ లీకేజీ వ్యవహారం బయటపడింది. సుమారు 410 ప్రశ్నలతో ఒక గెస్ పేపర్ పరీక్షకు ముందే విద్యార్థులకు అందగా.. అందులోని 120 కెమిస్ట్రీ ప్రశ్నలు పరీక్షలో వచ్చాయనే ఆరోపణలొచ్చాయి. ప్రశ్నల క్రమంతో పాటు ఆప్షన్లు కూడా ఒకే వరుసలో ఉండటంతో లీక్ జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధరించారు. మహారాష్ట్రలోని నాసిక్ నుంచి ప్రశ్నపత్నం లీక్ అయి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. అక్కడి నుంచి రాజస్థాన్, హరియాణా, జమ్మూకశ్మీర్, కేరళ సహా పలు రాష్ట్రాలకు చేరినట్లు దర్యాప్తులో తేలింది. ఈ పేపర్ కోసం విద్యార్థుల నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేసినట్లు సమాచారం.

-----

# ఆన్ లైన్ లో మహానాడు!

**మే 15 రిపబ్లిక్ న్యూస్.**

టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ సీఎం చంద్రబాబు సంచలన నిర్ణయం తీసుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు పొదుపు చర్యల్లో భాగంగా టీడీపీ మహానాడు కార్యక్రమాన్ని ఈ ఏడాది కేవలం ఆన్ లైన్ లోనే జరపాలని నిర్ణయించారు. వాస్తవానికి ఈ నెల 27, 28, 29 తేదీల్లో నెల్లూరులో ఘనంగా మహానాడు నిర్వహించేందుకు ఏర్పాట్లు కూడా ముమ్మరంగా జరుగుతున్నాయి. అయితే, ప్రధాని మోదీ పశ్చిమాసియా సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకుని ఇంధన పొదుపుపై జాతికి దిశానిర్దేశం చేశారు. ఇప్పటికే ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రులు పొదుపు చర్యలు పాటిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇప్పుడు మహానాడును ఆన్ లైన్ లో హైబ్రిడ్ విధానంలో నిర్వహించాలని ప్రకటించడం ద్వారా ఆ పొదుపు చర్యలను మరింత ముందుకు తీసుకెళ్లారు. ఆన్ లైన్ లో మహానాడును ఈ నెల 27, 29 తేదీల్లో నిర్వహించనున్నారు. మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్ లో ఒక వేదిక నిర్మించి దానిపై పొలిట్ బ్యూరో సభ్యులు ప్రసంగించనున్నారు. ఈ హైబ్రిడ్ మహానాడు కోసం రాష్ట్రవ్యాప్తంగా 1,845 క్లస్టర్లలో ఎలక్ట్రానిక్ స్క్రీన్లు ఏర్పాటు చేయనున్నారు. ఎన్టీఆర్ భవన్ నుంచి పొలిట్ బ్యూరో సభ్యులు పాల్గొనేలా ఏర్పాట్లు చేయనున్నారు.

# అనుమతులు లేకుండా పైప్ లైన్ తవ్వకాలు





**చిప్పగిరి, మే,15,(రిపబ్లిక్ న్యూస్)**
అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా, హంద్రీనీవా కాలువ నుండి పైప్ లైన్ లో జెసిబి తోగి వేస్తుండగా నిబంధనలు ఉల్లంగించి వ్యవహరిస్తున్నారని ఆలూరు బ్రాంచ్ కెనాల్ డి ఈ చంద్రశేఖర్, జై ఈ శ్రీధర్ శు క్రవారం చిప్పగిరి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ అనుమతులను ఉల్లంఘించి చట్ట వ్యతిరేకంగా, దౌర్జన్యంగా, కాలువ ఒడ్డును జెసిబి తో త్రవ్వి 14 పైప్ లైన్ లో వేసుకుని వస్తున్నారని ఇది పూర్తి విరుద్ధమని పేర్కొన్నారు. దీంతో పోలీసులను



ఆశ్రయించగా చిప్పగిరి ఎస్సై సివి నరసింహులు ఆధ్వర్యంలో పోలీసులు త్రవ్వకాలు జరిగే ప్రదేశానికి వెళ్లి, అనుమతులు లేకుండా జెసిబి తో పైప్ లైన్ కు త్రవ్వే చోట నుండి చిప్పగిరి పోలీస్ స్టేషన్ కు జెసిబిని రైతులను తీసుకొచ్చారు. ఆలూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ రవిశంకర్ రెడ్డి హుటాహుటిన నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రదేశానికి వెళ్లి జలచౌరానికి పాల్పడకూడదని, ఇరిగేషన్ అనుమతులు ఉండాలని , ఇరిగేషన్ అధికారుల ఫిర్యాదు మేరకు నిబంధనలు ఉల్లంఘన కేసు



నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఇరిగేషన్ అధికారులపై దౌర్జన్యాలకు దిగితే కట్టుదిట్టమైన చర్యలు తప్ప ఉన్నారు. ఇటీవల గుంతకల్లు చిప్పగిరి రోడ్డు మధ్యలో ఆర్ అండ్ బి అనుమతులు లేకుండా తార్ రోడ్డు ను కూడా త్రవ్వి వాహనదారులకు ఇబ్బంది కలిగించరాదని తెలిపారు.

# గ్రామపంచాయతీ కార్మికుల వేతనాల తగ్గింపు..

**నిరసనగా రేపటి నుండి విధులు బహిష్కరణ...**

**దేవనకొండ మే 15( ప్రజా రిపబ్లిక్ న్యూస్ ):-**
దేవనకొండ గ్రామపంచాయతీ లో పనిచేస్తున్న వివిధ రకాల కార్మికులకు ఇటీవల గ్రామ పంచాయతీ అధికారుల పంపిన వేతనాల ప్రతిపాదనను మరింతగా తగ్గిస్తూ కార్మికులకు అన్యాయం చేసే పద్ధతుల్లో వేతనాల ప్రతిపాదన ఉన్నందున రేపటినుండి విధులు బహిష్కరిస్తున్నామని గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఇనాయతుల, రామాంజనేయులు ,దేవా లు పేర్కొన్నారు...శు క్రవారం నాడు ఈ మేరకు గ్రామపంచాయతీ కార్యదర్శి రాముడు గారికి విధులు బహిష్కరిస్తున్నట్లువ్రాతపూర్వకంగా తెలియజేశారు ఈ కార్యక్రమం సందర్భంగా హాజరైన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బి.వీరశేఖర్ సిఐటియు



మండల కార్యదర్శి అశోక్ లు మాట్లాడుతూ ఏదైనా రంగంలో గానీ సంస్థల గాని పనిచేసే కార్మికులకు సంవత్సరంకు రెండు సంవత్సరాల కు వేతనాలు పెంచే ప్రతిపాదన ఉంటుంది కానీ ఉన్న వేతనాలకు కోత కోసి తగ్గించి ఇస్తామని చెప్పడం బహుశా గ్రామ పంచాయితీలోనే జరుగుతుందని విమర్శించారు .చాలా క్లిష్టమైన, అసహ్యకరమైన, అభ్యంతరకరమైన పనులు చేసే పారిశుద్ధ కార్మికులకు వారి పనికి తగ్గ వేతనం ఇవ్వాలని అదేవిధంగా నీటి సరఫరా, విద్యుత్తు సరఫరా ఆఫీసు సహాయకంగా ఉన్నటువంటి కార్మికులకు గతంలో ఇస్తున్న వేతనం కంటే పెంచి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు అధికారులు ఈ విషయం వారి దృష్టికి తెస్తే తమకు తెలియదన్నట్లు పై అధికారుల నిబంధనలో పాటిస్తున్నామని చెప్పడం విడ్డూరంగా ఉందని మాతో పని చేయించుకునే అధికారులు మాకు న్యాయం చేయకుంటే ఎవరు చేయాలని కార్మికుల సందర్భంగా ప్రశ్నించారు అధికారుల వైఖరికి నిరసనగా రేపటినుండి అన్ని రకాల కార్మికులు వారి విధులు బహిష్కరిస్తున్నామని కార్యదర్శి గారికి తెలియజేశారు ఈ కార్యక్రమంలో నరేష్, ప్రశాంత్, సఫీ, బద్రీ,రాముడు, నాగేశ్వర రావు, లక్ష్మి,మాధవి, మూకీ రంగస్వామి, అరవింద్, రంగస్వామి,

# అధికారుల ఆదేశాల మేరకు నిబంధనలకు లోబడే డ్రైనేజీ పనులు

**డి ఈ.బాలనరసింహులు.**


**రైల్వే కోడూరు మే 15 రిపబ్లిక్ న్యూస్.**
రైల్వేకోడూరు పట్టణంలో జరుగుతున్న డ్రెయినేజి , సిసి రోడ్డు పనులు అధికారుల ఆదేశాల మేరకే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నిబంధనలకు లోబడి పనులు చేపడుతున్నామన్నారు, స్థానిక ప్రజలకు సౌకర్యంగా ఉండేందుకే ఈ పనులు ప్రారంభించినట్లు కోడూరు పంచాయతీ అధికారి బాల నరసింహులు విలేకరుల సమావేశంలో శుక్రవారం తెలియ జేశారు,కానీ స్థానిక ప్రజలఆరోపణ మాత్రం





మరోలావుంది సిమెంట్ రోడ్డును పగులగొట్టి అండర్ గ్రౌండ్ డ్రెయినేజి , కొత్త సిసి రోడ్డు నిర్మాణం చేపట్టడం ప్రజా ధన వృథా అని ఆరోపించారు. సర్వే నెంబర్లు 53A, 54Bలకు సంబంధించిన భూములపై హైకోర్టు మరియు రాజంపేట అదనపు జిల్లా కోర్టులో కేసులు పెండింగ్‌లో ఉన్నప్పటికీ పనులు కొనసాగించడం ఎవరి ప్రయోజనం కోసం ఈ అత్యుత్సాహం అంటున్నారు, డ్రాయింగ్స్, డిజైన్స్, క్వాలిటీ కంట్రోల్ ప్రమాణాలు పాటించకుండా ప్రజా వ్యతిరేక పనులు చేస్తున్నారని విమర్శించారు.
సంబంధిత అధికారులు వెంటనే స్పందించి వివాదాస్పద పనులను నిలిపివేసి విచారణ చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు డిఈఈ, పిఆర్ఐ సబ్ డివిజన్, కోడూరు అధికారులకు ప్రజలు వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు

# క్రమశిక్షణ లేకపోతే ఇంటికే..!

## విధుల్లో నిర్లక్ష్యంపై మున్సిపల్ సిబ్బందికి కమిషనర్ చల్లా ఓబులేసు సీరియస్ వార్నింగ్







**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మే 15)**
కర్నూలు నగరపాలక సంస్థలో పనిచేసే ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యం, క్రమశిక్షణ లోపంతో వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని కమిషనర్ చల్లా ఓబులేసు హెచ్చరించారు. 14వ శానిటేషన్ మస్టర్‌ను తనిఖీ చేసిన ఆయన, అనంతరం చెన్నమ్మ సర్కిల్, బళ్లారి చౌరస్తా, వాణిజ్య నగర్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు.
ఈ సందర్భంగా హాజరు నమోదు చేసి ఇంటికి వెళ్లిపోయిన ఓ ఉద్యోగిపై ఆగ్రహం వ్యక్తం చేసిన కమిషనర్, అతని జీతం కట్ చేయాలని అధికారులకు ఆదేశించారు. మరో కార్మికుడు విధి సమయంలో మొబైల్ ఫోన్‌లో కాలక్షేపం చేస్తుండటాన్ని గమనించి తీవ్రంగా మందలించారు. "హాజరు వేసుకుని ఇంటికి వెళ్తే ఉద్యోగం ఎందుకు..? పని సమయంలో మొబైల్ చూస్తూ ఉంటే జీతాలు ఎందుకు ఇవ్వాలి..?" అంటూ సిబ్బందికి గట్టి హెచ్చరిక చేశారు.



పిన్ పాయింట్ ప్రోగ్రామ్‌ను కచ్చితంగా అమలు చేసి ప్రతి వీధి పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విధులకు ఉద్దేశపూర్వకంగా గైర్హాజరు కావడం, పని వేళల్లో మొబైల్ ఫోన్లతో కాలక్షేపం చేయడం వంటి చర్యలను సహించబోమని స్పష్టం చేశారు.
అనంతరం పరిమళ నగర్‌లోని అన్న క్యాంటీన్‌ను పరిశీలించిన కమిషనర్, అక్కడి స్వచ్ఛత, తాగునీటి సరఫరా, భోజన నాణ్యత వంటి అంశాలను తనిఖీ చేశారు. ప్రజలకు అందుతున్న సేవల్లో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.
నగరపాలక కార్యాలయంలో ప్రజలకు కల్పించనున్న వసతులను కూడా ఆయన పరిశీలించారు. ఇటీవల కమిషనర్ ఆదేశాల మేరకు కార్యాలయంలో కుర్చీలు, వాటర్ కూలర్, హెల్ప్ డెస్క్, టోల్ ఫ్రీ నంబర్ వంటి సౌకర్యాల ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రజలకు కనీస వసతులు కల్పించడం కార్పొరేషన్ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.
అదేవిధంగా వెండర్ జోన్ల ఏర్పాటుకు వెంకటరమణ కాలనీలోని హరిత హోటల్ వెనుక ప్రాంతాన్ని పరిశీలించారు.
ఈ కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాషా, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు మునిస్వామి, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# మహిళలపై నేరాల అవగాహన కార్యక్రమం

**సీఐ రవిశంకర్ రెడ్డి, ఎస్సై సి. వెంకట నరసింహులు**






**చిప్పగిరి, మే, 15,( రిపబ్లిక్ న్యూస్)** చిప్పగిరి స్థానిక భోగేశ్వర స్వామి ఆలయం నందు మహిళలపై నేరాల అవగాహన కార్యక్రమం సీఐ రవిశంకర్ రెడ్డి, ఎస్సై సి వెంకట నరసింహులు, ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు, ఐవిఆర్ఎస్ కాల్స్, మహిళలపై నేరాలు, మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన, సైబర్ నేరాలు, క్రికెట్ బెట్టింగ్, చట్ట విరుద్ధ కార్యాల పాలు, మరియు ప్రజల భద్రతపై అవగాహన, శాంతిభద్రతలను నిర్వహణలో సమాజ సహకారం యొక్క ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు, ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, గ్రామ మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# రైతు కుటుంబాలకు న్యాయం చేయాలి

**రైతు ఆత్మహత్య బాధితులకు పరిహారం అందించండి: బొల్లెద్దుల కిరణ్ కుమార్**





**దేవనకొండ, మే 15( ప్రజా రిపబ్లిక్ న్యూస్):-**రాష్ట్రంలో పెరుగుతున్న రైతు ఆత్మహత్యల నేపథ్యంలో బాధిత కుటుంబాలకు తక్షణ పరిహారం అందించాలని దేవనకొండ బీజేపీనాయకులు ఆదోని ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు బొల్లెద్దుల కిరణ్ కుమార్ మాట్లాడుతూ అప్పుల బాధతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు రోజురోజుకూపెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.రైతు కుటుంబాలు పెద్ద దిక్కును కోల్పోయి ఆర్థికంగా, సామాజికంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. చాలామంది బాధిత కుటుంబాలకు స్పౌస్ పెన్షన్ కూడా అందడం లేదని, ప్రభుత్వ సహాయం లేక జీవనం భారంగా మారిందన్నారు.ఈ విషయాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి మరియు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, రైతు ఆత్మహత్య బాధిత కుటుంబాలకు అందవలసిన పరిహారం వెంటనే అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేకు సాదరంగా ఆహ్వానం పలికి వినతిపత్రం అందజేసిన వారిలో జిల్లా కార్యవర్గ సభ్యులు జంగం వీరయ్య, సీనియర్ నాయకులు బోడ రవి, మండల ప్రధాన కార్యదర్శి వెంకటేష్, మండల ఉపాధ్యక్షులు వీరభద్రి, నాగరాజు, మండల కార్యదర్శి మహేష్, తెర్నేకల్ బూత్ అధ్యక్షుడు నరసింహ, నాయకులు పెద్ద బజారి, బజారి బాబు తదితరులు పాల్గొన్నారు.

# పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే ఉపసంహరించాలి: సీపీఐ డిమాండ్

**జిల్లా వ్యాప్తంగా నిరసనలకు పిలుపు మోడీ ప్రభుత్వ విధానాలపై బి.గిడ్డయ్య ఆగ్రహం**

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మే 15)**
కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం ఇటీవల పెంచిన పెట్రోల్, డీజిల్, వాణిజ్య గ్యాస్, సిఎన్‌జి గ్యాస్ ధరలను తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య డిమాండ్ చేశారు. ఈ ధరల పెంపును వ్యతిరేకిస్తూ జిల్లా వ్యాప్తంగా అన్ని పట్టణాలు, మండల కేంద్రాలలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సీపీఐ పిలుపునిచ్చింది.




కర్నూలులోని సీఆర్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్.మునెప్ప, ఎన్.లెనిన్ బాబులతో కలిసి మాట్లాడిన గిడ్డయ్య, ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన వెంటనే కేంద్ర ప్రభుత్వం ప్రజలపై పెట్రో భారాన్ని మోపిందని విమర్శించారు. ఎన్నికల ముందు ఒక విధంగా, ఎన్నికల తరువాత మరో విధంగా వ్యవహరించడం మోడీ ప్రభుత్వానికి అలవాటైందన్నారు.
ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్‌పై రూ.3.29, డీజిల్‌పై రూ.3.14, సిఎన్‌జి గ్యాస్‌పై కిలోకు రూ.2 పెంచారని తెలిపారు. ఇటీవల వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరను భారీగా పెంచడం వల్ల ప్రజలపై మరింత ఆర్థిక భారం పడుతోందన్నారు. పెట్రో ఉత్పత్తుల ధరల పెరుగుదల రవాణా రంగంపై ప్రభావం చూపి, నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరిగే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.
ఇప్పటికే అప్పులు చేసి పంటలు సాగు చేస్తున్న రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారుతుందని, కూలీలు, పేద ప్రజల జీవనం భారమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ఆదాయాలు పెరగకపోయినా ఖర్చులు విపరీతంగా పెరిగి అప్పుల భారంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. పెట్రో ఉత్పత్తులపై పన్నులు, సుంకాలు తగ్గించడం వంటి ప్రత్యామ్నాయాలను పక్కనబెట్టి ప్రజలపై భారాలు మోపడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యమని విమర్శించారు. నిరసన కార్యక్రమాలలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసించాలని సీపీఐ నాయకులు పిలుపునిచ్చారు.

# ఇంధన పొదుపుకు నడకతో సందేశం ఇచ్చిన ఒన్‌టౌన్ సీఐ మారుతి శంకర్

**నివాసం నుంచి పోలీస్ స్టేషన్ వరకు నడిచి వెళ్లిన సీఐ.. ఇంధన పొదుపు ప్రతి పౌరుడి బాధ్యత అంటూ అవగాహన**

**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మే 15)**
ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ఇంధన పొదుపు అత్యంత అవసరమని కర్నూలు ఒన్‌టౌన్ సీఐ జి. మారుతి శంకర్ పేర్కొన్నారు.
దేశ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహా పలువురు ప్రజాప్రతినిధులు ఇంధన పొదుపు




చర్యలకు ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు.ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు సీఐ మారుతి శంకర్ తన నివాసం నుంచి కర్నూలు ఒన్‌టౌన్ పోలీస్ స్టేషన్ వరకు నడిచి వెళ్లి ఆదర్శంగా నిలిచారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అవసరం లేని వాహన వినియోగాన్ని తగ్గించడం ద్వారా ఇంధనాన్ని ఆదా చేయవచ్చని, ప్రతి ఒక్కరూ చిన్నచిన్న మార్పులతో దేశాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు.

# రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ చంద్రబాబు కు ఘన స్వాగతం








**శ్రీ సత్యసాయి/పుట్టపర్తి, మే 15,(రిపబ్లిక్ న్యూస్):** శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో దేశం గర్వించే అత్యంత ప్రతిష్టాత్మకమైన అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏ ఎం సి ఏ) డిఫెన్స్ ప్రాజెక్టును ఏరోనాటికల్ డెవలప్మెంట్ ఏజెన్సీ–డీఆర్డీఓ సంస్థలు సంయుక్తంగా ఏర్పాటు చేయనున్నాయి. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి శుక్రవారం ఉదయం శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి విమానాశ్రయానికి కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ , రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేరుకున్నారు. కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ కు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు పుట్టపర్తి విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. విమానాశ్రయంలో కేంద్ర రక్షణ మంత్రి గారికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రివర్యులు నారా లోకేష్, తదితరులు పుష్పగుచ్చాలు అందించి ఘన స్వాగతం పలికారు. కేంద్ర రక్షణ మంత్రికి రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, రాష్ట్ర ఆర్థిక ,ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ.భరత్, రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమం, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమం, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, హిందూపురం, అనంతపురం ఎంపీలు బికే.పార్థసారథి, అంబికా లక్ష్మీనారాయణ, ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు పల్లె సింధూరరెడ్డి, ఎంఎస్.రాజు, కందికుంట వెంకట ప్రసాద్, అమిలినేని సురేంద్రబాబు, గుమ్మనూరు జయరాం, దగ్గుపాటి ప్రసాద్, జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, తదితరులు ఘన స్వాగతం పలికారు. అంతకుముందు విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి



మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, తదితరులు పుష్పగుచ్చాలు అందించి ఘన స్వాగతం పలికారు

## వేంపెంట గ్రామంలో మృతి చెందిన పట్నం సామేలు కుటుంబానికి రూ.5,000/- ఆర్థిక సహాయం అందించిన టేకూరి కుటుంబం



**పాములపాడు మే-15 రిపబ్లిక్ న్యూస్:-** పాములపాడు మండలంలోని, వేంపెంట గ్రామానికి చెందిన పట్నం సామేలు ప్రమాదవశాత్తు మరణించిన విషయం తెలుసుకుని, మాజీ సర్పంచ్ టేకూరి.రామసుబ్బమ్మ వారి నివాసానికి వెళ్లి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి రూ. 5,000/- ఆర్థిక సహాయం అందించారు. ఆ కుటుంబానికి అన్ని విధాలుగా తోడుగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ విషయం తెలుసుకొని సింగపూర్ నుంచి వరల్డ్ హ్యూమన్ రైట్స్ వార్డ్ గ్రహీత డాక్టర్ టేకూరి.నాగేశ్వరావు కూడా తమ సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బోనపల్లె సత్యరాజు, బూత్ కన్వీనర్ బోనపల్లె వినయ్ కుమార్, బొమ్మ రాజేశ్, చెంచాని వేమారెడ్డి, రమేష్ రెడ్డి, సిరిపిరెడ్డి వేమా రెడ్డి, నారాయణ రెడ్డి, చిన్నస్వామి ఆచారి, సుబ్బారావు, రత్నాకర్, జీవన్న, చిన్న సుబ్బయ్య, మొగిలి శ్రీను, శేషి రెడ్డి, సురేష్, మురహరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## నంబర్ ప్లేట్లు లేని వాహనాలపై పోలీసుల కొరడా

**కర్నూలు మెయిన్ బజార్‌లో ప్రత్యేక తనిఖీలు.. 10 వాహనాలకు జరిమానాలు విధింపు**



**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మే 15)**విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు శుక్రవారం కర్నూలు ఒన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మెయిన్ బజార్ ప్రాంతంలో ప్రత్యేక వాహనాల తనిఖీలు నిర్వహించారు. కర్నూలు వన్ టౌన్ సీఐ మారుతి శంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో నంబర్ ప్లేట్లు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న 10 వాహనాలను పోలీసులు గుర్తించారు. వాహనాల యజమానులపై మోటార్ వాహనాల చట్టం ప్రకారం జరిమానాలు విధించడంతో పాటు, అక్కడికక్కడే కొత్త నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేయించారు. నంబర్ ప్లేట్లు లేని వాహనాలకు సంబంధించిన పత్రాలను కూడా పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ, వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. నంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## నాగలాపురం సుంకుల పరమేశ్వరి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

**.ఎంపీ బస్తిపాటి నాగరాజు**

**కర్నూలు ప్రతినిధి, మే 15(రిపబ్లిక్ న్యూస్)** కర్నూలు జిల్లా గూడూరు మండలం కె.నాగలాపురంలోని సుంకుల పరమేశ్వరి ఆలయ నూతన ధర్మకర్తల మండలి సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం కార్యక్రమంలో కోడుమూరు ఎం.ఎల్.ఏ బొగ్గుల దస్తగిరితో కలిసి కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం సుంకుల పరమేశ్వరి ఆలయ అభివృద్ధిని పూర్తిగా విస్మరించడంతో పాటు ఆలయంలో అవినీతి, అరాచకాలకు పాల్పడిందని మండిపడ్డారు. తన ఎంపీ నిధులతో ఆలయాన్ని మరింత అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తానన్న ఆయన. నూతన ధర్మకర్తల మండలి సభ్యులు అమ్మవారి దర్శనాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతకు ముందు సుంకుల పరమేశ్వరి అమ్మవారిని ఎం.ఎల్.ఏ తో కలిసి ఎంపీ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు




## 10వ తరగతి ఫలితాల్లో మంచి ప్రతిభ కనబరచిన వేంపెంట జడ్పీ హైస్కూల్ విద్యార్థులను ఘనంగా సన్మానించి, అభినందించిన అంతర్జాతీయ సమాజ సేవకుడు సింగపూర్ డాక్టర్ టేకూరి.నాగేశ్వరావు

**పాములపాడు మే-4 రిపబ్లిక్ న్యూస్:-** పాములపాడు మండలంలోని, వేంపెంట గ్రామంలో ఇటీవల జరిగిన 10 వ తరగతి ఫలితాలలో అత్యంత ప్రతిభ కనపబరిచిన ప్రభుత్వ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు అంతర్జాతీయ సమాజ సేవకుడు & సింగపూర్ తెలుగు సమాజం ఉపాధ్యక్షుడు డాక్టర్ టేకూరి.నాగేశ్వరావు అభినందిస్తూ ఘనంగా సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా వరల్డ్ హ్యూమన్ రైట్స్ అవార్డు గ్రహీత డాక్టర్ టేకూరి.నాగేశ్వరరావు మండలంలో మొదటి స్థానం & జిల్లాలో మూడవ స్థానం సాధించిన వేంపెంట జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు బోనపల్లె భాను ప్రకాశ్ (592 మార్కులు)ను, రెండవ స్థానం సాధించిన శివ నాయక్(576 మార్కులు), మూడవ స్థానం సాధించిన మాడుగుల జోష్ (564 మార్కులు) సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సింగపూర్ స్పెషల్ గిఫ్ట్, నగదు బహుమతులు, తీపి గుర్తులుగా స్వీట్ బాక్స్ లు ఇచ్చి శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేయడం జరిగింది. మరియు మంచి ప్రోత్సాహం అందించినందుకు విద్యార్థులచే వారి తల్లిదండ్రులకు శాలువాలు కప్పి, ఘనంగా సన్మానించడం



చేయించడం జరిగింది. అనంతరం అంతర్జాతీయ సమాజ సేవకుడు & అందరివాడు మన ప్రియతమ గొప్ప సామాజికవేత్త డాక్టర్ టేకూరి.నాగేశ్వరరావు మాట్లాడుతూ నేటి బాలలే రేపటి భావి భారత దేశానికి పౌరులు అని వారందరికీ మనమందరము సహాయ సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు ఎటువంటి చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా మన భారత రాజ్యాంగాన్ని రచించిన భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, మొట్టమొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్, మన మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం లను ఆదర్శంగా తీసుకొని పేదరికం నుండి కష్టపడి చదివి పెద్ద పెద్ద శాస్త్రవేత్తలుగా, ఉన్నత స్థాయి ఉద్యోగులుగా కావాలని ఆ దేవుని ప్రార్థిస్తూ ఆకాంక్షిస్తున్నానని అన్నారు. మీరు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించి, మరిన్ని ఘనతలు సాధించాలని మీకు అండగా నేను ఉంటానని ధైర్యంగా ముందుకు వెళ్లాలని తెలిపారు. ఆయన విద్యార్థులకు మంచి విద్యాబోధన చేసి, మంచి మార్కులు రావడానికి కృషిచేసిన వేంపెంట ప్రభుత్వ జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎం- ఎం.రఫీక్ అహ్మద్ కు, ఉపాధ్యాయులకు, పాఠశాల సిబ్బందికి, పేరుపేరునా అభినందనలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ టేకూరి. రామసుబ్బమ్మ,బూత్ కన్వీనర్ బోనపల్లె వినయ్ కుమార్, బొమ్మ రాజేష్, ముద్దపాటి ప్రసాద్, వేమా రెడ్డి, నెంబర్ లక్ష్మన్న, కిరణ్, ఎర్రసాని రాము, చిన్నస్వామి ఆచారి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## పాములపాడు గొల్ల కళ్యాణ్ కి టిడిపి ప్రమాద బీమా 5 లక్షలు పంపిణీ చేసిన నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి

**పాములపాడు మే-15 రిపబ్లిక్ న్యూస్:-** మండల కేంద్రమైన పాములపాడు కు చెందిన గొల్ల కళ్యాణి కి నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి టిడిపి ప్రమాద బీమా 5 లక్షల రూపాయలు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ బైరెడ్డి శబరి మాట్లాడుతూ పాములపాడు గ్రామానికి, చెందిన గొల్ల వెంకటేశ్వర్లు 2026, ఫిబ్రవరి-12వ తేదీన నంద్యాల జిల్లా సమీపంలోని, జిందాల్ ఫ్యాక్టరీలో లారీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందడం గ్రామ ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. కుటుంబానికి అండగా నిలిచిన వ్యక్తిని కోల్పోవడంతో ఆయన భార్య కళ్యాణి ఇద్దరు చిన్న పిల్లలు తీవ్ర ఆర్థిక మరియు మానసిక వేదనలో ఉన్నారన్నారు. ఈ క్లిష్ట పరిస్థితిని గుర్తించిన పాములపాడు గ్రామానికి చెందిన జిల్లా టెలికాం అడ్వైజర్ కమిటీ సభ్యుడు & తెలుగుదేశం




పార్టీ యువ నాయకుడు కురువ.రమేష్ బాధిత కుటుంబ పరిస్థితిని నంద్యాల పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి కి వివరించి, తెలుగుదేశం పార్టీ సభ్యత్వ ప్రమాద బీమా కింద రూ. 5 లక్షల ఆర్థిక సహాయం త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పేద కుటుంబం ఎదుర్కొంటున్న బాధను మనస్ఫూర్తిగా పరిగణనలోకి తీసుకున్న నంద్యాల పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి వెంటనే స్పందించి, ప్రమాద బీమా కింద రావలసిన రూ. 5 లక్షల రూపాయలు సహాయం త్వరగా కుటుంబానికి అందేలా పార్టీతో మాట్లాడి చర్యలు చేపట్టడం అభినందనీయం అన్నారు. అంతేకాకుండా, వెంకటేశ్వర్లు భార్య గొల్ల.కళ్యాణి కి వితంతు పింఛన్ కూడా మంజూరు అయ్యేలా, పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. టిడిపి సభ్యత్వ ప్రమాద బీమా ఐదు లక్షల రూపాయలు రావడానికి కృషిచేసిన నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి.శబరమ్మ కు, పాములపాడు టిడిపి యువ నాయకుడు కురువ రమేష్ కు గొల్ల.కళ్యాణి, ఆమె కుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు, అభినందనలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బైరెడ్డి అభిమానులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొనడం జరిగింది.

## .రైల్వే స్టేషన్లో పర్యావరణ ప్రచార పోస్టర్ ను ప్రారంభించిన ఎంపీ నాగరాజు





**కర్నూలు ప్రతినిధి, మే 15(రిపబ్లిక్ న్యూస్)** పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రైల్వే శాఖ ఆధ్వర్యంలో మూడు వారాల పాటు నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమం ప్రచార పోస్టర్ తో పాటు, సోషల్ మీడియాలో ప్రయాణికుల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి, వాతావరణ మార్పుల థీమ్ తో ఏర్పాటు చేసిన ప్రత్యేక సెల్ఫీ బూత్ ను ఆయన ప్రారంభించారు. అనంతరం ప్లాస్టిక్ వ్యర్థలను తగ్గించడానికి రైల్వే ఉద్యోగులు, ప్రయాణికులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ ఒక్కో మొక్కను నాటి సంరంక్షిస్తే, భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందించిన వారమవుతామని ఎంపీ తెలిపారు.. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ శ్రీనివాసరావు, స్టేషన్ మాస్టర్ శ్రీధర్, నగర ఆరోగ్య మరియు మలేరియా ఇన్స్పెక్టర్, మరియు రైల్వే ఉద్యోగులు పాల్గొన్నారు..

# “వన్ మంత్ - ఫోర్ విజిట్”తో ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు

**ఆళ్లగడ్డలో ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికకు విశేష స్పందన**

**ఒక్కరోజే 458 అర్జీలు స్వీకరణ - వేగవంత పరిష్కారానికి కలెక్టర్ ఆదేశాలు**

**21 రోజులలోపు ప్రజా ఫిర్యాదుల పరిష్కారమే లక్ష్యం : కలెక్టర్ రాజకుమారి గణియా**

**ప్రజల వద్దకే అధికారులు రావడం ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనం**

**గ్రీవెన్స్ లేని ఆళ్లగడ్డే లక్ష్యం : ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ**







**నంద్యాల బ్యూరో, మే 15 (రిపబ్లిక్ న్యూస్):**
“వన్ మంత్ – ఫోర్ విజిట్” కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్వీకరించిన ప్రజల ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులనుఆదేశించారు. శుక్రవారం ఆళ్లగడ్డ పట్టణంలోని మహాలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియతో కలిసి ప్రజల నుండి నేరుగా వినతులు, ఫిర్యాదులు, సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, జిల్లా కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమానికి దూర ప్రాంతాల ప్రజలు రావడంలో ఇబ్బందులు ఎదురవుతున్నందున, ప్రజలకు మరింత చేరువగా సేవలు అందించేందుకు ఇకపై ప్రతి శుక్రవారం నియోజకవర్గ స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిరంతరాయంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను వాటి స్వభావాన్ని బట్టి ఒక రోజు నుండి గరిష్టంగా 21 రోజుల లోపు పరిష్కరించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ఎన్నికల నియోజకవర్గాల వారీగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని, అందులో భాగంగా మొదటిసారిగా ఆళ్లగడ్డ నియోజకవర్గంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించిందన్నారు. ఒక్కరోజే సుమారు 458 అర్జీలు అందాయని, వాటన్నింటినీ స్కాన్ చేసి సంబంధిత అధికారుల లాగిన్‌లకు పంపిస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ప్రజల నుండి అందిన ఫిర్యాదుల్లో దాదాపు 60 శాతం భూ వివాదాలకు సంబంధించినవేనని, 25 శాతం అభివృద్ధి పనులు, రహదారులు, కల్వర్టులు, పాఠశాలల స్థల సమతలీకరణ, శ్మశాన వాటికలు వంటి అంశాలపై ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. మిగిలిన 10 నుంచి 15 శాతం వరకు వృద్ధాప్య, వికలాంగ పింఛన్లు, సదరం స్లాట్లకు సంబంధించిన సమస్యలేనని పేర్కొన్నారు. అలాగే మొదటి, రెండో శుక్రవారాల్లో ప్రజల నుండి అర్జీలు స్వీకరించి, మూడో శుక్రవారం నాటికి వాటి పరిష్కారానికి చర్యలు పూర్తి చేయాలని, నాలుగో శుక్రవారం నిర్వహించే సమీక్షలో ఎన్ని కేసులు పరిష్కరించామో, ఎన్ని పట్టాలు పంపిణీ చేశామో సమగ్రంగా పరిశీలిస్తామని కలెక్టర్ తెలిపారు. క్షేత్రస్థాయిలో అధికారులు సమర్థవంతంగా స్పందించకపోవడం వల్లే ప్రజలు జిల్లా కలెక్టర్ దాకా రావాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని, గ్రామ మరియు మండల స్థాయి అధికారులు తమ పనితీరును మెరుగు పరచుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించినా, తప్పుడు సమాచారం అందించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వచ్చే శుక్రవారం ఉదయం 9 గంటలకే అధికారులు హాజరై, కనీసం 450 అర్జీల పరిష్కారంతో బాధితులకు పత్రాలు అందించేలా సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు ప్రభుత్వ యంత్రాంగం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మాట్లాడుతూ, గతంలో చిన్న చిన్న పనుల కోసం ప్రజలు అధికారుల చుట్టూ ఎన్నోసార్లు తిరగాల్సి వచ్చేదని, ప్రస్తుతం అధికారులే ప్రజల వద్దకు వచ్చి సమస్యలు పరిష్కరిస్తుండటం ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. అధికారులు ఎలాంటి ఒత్తిడులకు లోనుకాకుండా స్వేచ్ఛగా పని చేసే వాతావరణాన్ని ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ఇంకా అనేక వెనుకబడిన ప్రాంతాలు ఉన్నాయని, ప్రజలు అభివృద్ధి పనులు కోరుతూ ముందుకు రావడం సంతోషకరమన్నారు. ఫిర్యాదులు లేని ఆళ్లగడ్డ, సమస్యలు లేని ఆంధ్రప్రదేశ్‌ను చూడాలన్నదే తమ లక్ష్యమని ఆకాంక్షించారు. మండలాల వారీగా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, ఎక్కువ ఫిర్యాదులను పరిష్కరించిన మండల అధికారులను ప్రోత్సాహకంగా సన్మానిస్తామని తెలిపారు. దీన్ని పోటీగా భావించి అధికారులు మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎమ్మెల్యే అఖిలప్రియ పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలను వినేందుకు వరుసగా నాలుగు శుక్రవారాలు జిల్లా యంత్రాంగం మొత్తం ఆళ్లగడ్డకు రావడం ఆనందంగా ఉందన్నారు. కలెక్టర్, ఆర్డీఓ, డీఎస్పీ, వివిధ శాఖల అధికారులు, పోలీస్ సిబ్బందికి ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

### ప్రత్యేక పీజీఆర్ఎస్ ద్వారా స్వీకరించిన సమస్యలు

1) చాగలమర్రి మండలం ముత్యాలతండాకు చెందిన బుక్కే వీరమ్మ భాయ్ తనకు సొంత భూమి లేదని, సర్వే నెం.959లో అనేక సంవత్సరాలుగా సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నట్లు తెలిపారు. సదరు భూమికి డి-పట్టా మంజూరు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు సమర్పించారు.

2) రుద్రవరం మండలం నరసాపురం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక (మెయిన్) పాఠశాలలో సుమారు 100 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారని, పాఠశాలలో ఉన్న మూడు పాత తరగతి గదులు శిథిలావస్థకు చేరుకొని కూలిపోయే ప్రమాదంలో ఉన్నాయని ఉపాధ్యాయుడు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని తరగతి గదులను పునర్నిర్మించడంతో పాటు, పాఠశాల రహదారికి సమీపంలో ఉండటంతో విద్యార్థుల భద్రత కోసం స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు.

3) ఆళ్లగడ్డ మండలం యాదవాడ గ్రామానికి చెందిన వెంకట సుబ్బమ్మ తన భర్త మరణించి రెండేళ్లు అయినప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి పెన్షన్ మంజూరు కాలేదని పేర్కొన్నారు. తనకు విధవ పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు సమర్పించారు.

4) ఆళ్లగడ్డ మండలం బాచేపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి సర్వే నెం.380లోని రెండు ఎకరాల భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు, సర్వే నెం.349కు సంబంధించిన రీసర్వేలో 0.16 సెంట్లకు బదులుగా 1.71 సెంట్లు నమోదయ్యాయని తెలిపారు. సంబంధిత భూ విస్తీర్ణ వివరాలను సరిచేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు

# భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ,అమరజీవి కామ్రేడ్ నక్కి.రామన్న 36వ వర్ధంతి సందర్భంగా నివాళి

**బేతంచర్ల ప్రతినిధి, మే 15(రిపబ్లిక్ న్యూస్)**
బేతంచర్ల పట్టణంలోని సీపీఐ కార్యాలయం నందు మండల కార్యదర్శి భార్గవ్.యన్న, సహాయ కార్యదర్శి తాలుకా.తిరుమలేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్, మండల కార్యదర్శి మధు, శ్రీను ల ఆధ్వర్యంలో నక్కి.రామన్న 36వ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి అనంతరం మాట్లాడుతూ.





డోన్ నియోజకవర్గ ప్రజలు రెండు ప్రధాన ముఠా రాజకీయాల నాయకుల మధ్య నలిగిపోతున్న తరుణంలలో సీపీఐ ఆవిర్భవించి కటారు కొండ గ్రామంలో అనగారిన వర్గాల మైనార్టీల దళితుల స్వేచ్ఛ కోసం ఎర్రజెండాను చేతబట్టి కామ్రేడ్ నక్కి.రామన్న గ్రామాన్ని విముక్తి చేయడంలో రాజీ లేని పోరాటలు నిర్వహించి తన ప్రాణాలను 1990 మే15న అర్పించారు కామ్రేడ్ నక్కి రామన్న డోన్ తాలూకా సీపీఐ కార్యదర్శిగా పనిచేస్తూ గ్రామ గ్రామాన తిరిగి కమ్యూనిస్టు పార్టీ స్థాపించి రైతన్న, వ్యవసాయ, కార్మిక, యువజన, విద్యార్థి, సంఘాల బలోపేతనం చేసి వెనకబడిన మైనార్టీ దళిత గిరిజనులకు అండగా నిలబడి భూమి లేని నిరుపేదల కోసం దున్నేవాడికే భూమి నినాదంతో భూస్వామ్య పెత్తందారుల చేతుల్లో ఉన్న భూములను పంచేందుకు భూ పోరాటాలు చేసి పేదలకు దక్కించి విజయం సాధించారు. అప్పటి వరకు అభివృద్ధికి నోచుకోని పేదలకు ఇండ్ల స్థలాలు పక్క ఇండ్లు పెన్షన్లు గ్రామంలో రోడ్లు నిర్మాణం త్రాగునీరు తదితర మౌలిక సౌకర్యాలు కోసం కృషి చేశారు కామ్రేడ్ నక్కి రామన్న తాలూకలో పార్టీని విస్తరింప చేసేందుకు కృషి చేస్తూనే ప్రజల కోసం విశేషమైన కృషి చేసి నేడు జరుగుతున్న గ్రామ అభివృద్ధికి ఆనాడే బాటలు వేశారు అందుకే కామ్రేడ్ నక్కి రామన్న మరణించి 36 సంవత్సరాలు గడిచిన నేటికీ ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఎర్రజెండాను ఈ దేశంలో దోపిడీ లేని సోషలిస్టు సమాజ నిర్మాణమే లక్ష్యంగా పనిచేసిన కామ్రేడ్ నక్కి రామన్న ను పార్టీకి ప్రజలకు చేసిన ఆయన సేవలను స్మరించుకొని ఈ దేశంలో మార్పు కోసం ఆయన కలలుగన్న సమాజ నిర్మాణం లక్ష్యంగా పోరాటాలు నిర్వహించాలని వారన్నారు ఆయన చేసిన పోరాటాల ఫలితంగానే ఎర్ర జెండా ముద్దు బిడ్డలు స్వేచ్ఛ వాయు పీల్చుకుంటున్నారని వారి విప్లవ ఆశయాల కోసం మరింతగా పాటుపడాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల కోసం మరింతగా ఉద్యమాలు ఉధృతం చేయాలని పేదవారు కొనలేని నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశమంటుతున్నా పట్టించుకోని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

# ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నూతన పల్లెలో ఉపాధి కూలీలతో నిరసన కార్యక్రమం





**కర్నూలు ప్రతినిధి, మే 15(రిపబ్లిక్ న్యూస్)** భారతీయ కేత్ మద్దూర్ యూనియన్ భారతీయ సమితి పిలుపుమేరకు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కర్నూల్ రూరల్ పరిధిలోని శుక్రవారం రోజున నూతనపల్లి గ్రామంలో ఉపాధి కూలీలతో నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది, ఉపాధి కూలీలతో పాటు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బి సురేంద్ర పెద్ద ఆంజనేయులు ఉదయ్ పాల్గొనడం జరిగింది

# సల్కాపురం గ్రామంలో శ్రీ గణపతి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చెన్నకేశవ స్వామి గరుడ ధ్వజ ప్రతిష్ట మహోత్సవం కార్యక్రమం

**ముఖ్యఅతిథిగా పాల్గొన్న పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి**

**కల్లూరు ప్రతినిధి, మే 15(రిపబ్లిక్ న్యూస్)**
కల్లూరు మండలం సల్కాపురం గ్రామంలో శుక్రవారం రోజున నిర్వహించిన శ్రీ గణపతి, శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చెన్నకేశవ స్వామి, శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి వారి గరుడ ధ్వజ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వైఎస్ఆర్సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి,ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించగా, కాటసాని రామభూపాల్ రెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు...అనంతరం





గ్రామ పెద్దలు, భక్తులు ఆయనకు ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు...గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, ఆలయ అభివృద్ధితో గ్రామానికి మరింత ఆధ్యాత్మిక వాతావరణం ఏర్పడాలని ఆకాంక్షిస్తూ స్వామివారి ఆశీస్సులు అందరికీ ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ నాయకులు ఎంపీపీశారదమ్మ ,మద్దిలేటి ,వేణు గోపాల్ రెడ్డి ,చిన్న మద్దిలేటి , మార్కాపురం మద్దిలేటి, వైఎస్ఆర్ సీపీ మాజీ కార్పొరేటర్లు దండు లక్ష్మి కాంత రెడ్డి ,నారాయణ రెడ్డి ,కార్యకర్తలు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# సమస్య మీది పరిష్కారం కూటమిది: కూడా ఛైర్మన్.







**రైల్వే కోడూరు మే 15 రిపబ్లిక్ న్యూస్.**
రైల్వే కోడూరు నియోజకవర్గం రాఘవరాజపురం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ప్రజా దర్బార్ కార్య క్రమంలో కూడా చైర్మన్ రైల్వే కోడురు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ప్రజాదర్బార్ లో పాల్గొన్న ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ సమస్య మీది పరిష్కారం కూటమి ప్రభుత్వాన్ని అని వ్యాఖ్యానించారు, ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజా దర్బార్ లక్ష్యమని ఆయన అన్నారు,

ఐదు మండలాల్లోని తమ సమస్యలను విన్నవించుకోవడం కోసం పార్టీ కార్యాలయంకు వచ్చిన ప్రజలు తమ వినతులను వినతిపత్ర రూపంలో రూపానంద రెడ్డికి అందజేయడం జరిగింది. ఇందులో ముఖ్యంగా రెవెన్యూ మరియు విద్యుత్ శాఖకు సంబంధించి సమస్యలు కాగా వాటిని సంబంధిత అధికారులతో మాట్లాడి బాధితుల సమస్యలను సాధ్యమైన మేర సమస్యలకు పరిష్కారం



చూపాలని అధికారులకు చెప్పడం జరిగింది. ప్రజా సమస్యలపై స్పందిస్తూ ప్రజాసంక్షేమం అభివృద్ధి కొరకు పాటుపడుతున్న ప్రజా నాయకుడి యొక్క దృక్పథాన్ని చూసి అర్జీదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రతి వారం ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అందులో భాగంగా ఈ శుక్రవారం కూడా నిర్వహించడం జరిగిందని ఇక్కడ ప్రజలు తమ సమస్యలను విన్నవించుకోవడం కోసం రావడం జరుగుతుందని వారి యొక్క సమస్యలను పరిష్కరించే దిశగా సంబంధిత అధికార యంత్రాంగంతో మాట్లాడి త్వరితగతిన పరిష్కారం చేయాలని తెలియజేస్తూ, ముఖ్యంగా రెవెన్యూ, విద్యుత్ శాఖ, పోలీస్ శాఖ మరియు జలవనరుల శాఖకు సంబంధించి ఫిర్యాదులు రావడంతో వాటన్నిటిని కూడా కులంకషంగా చర్చించి న్యాయపరమైనటువంటి చర్యలు చేపట్టాలని రైల్వేకోడూరు నియోజకవర్గంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎటువంటి సమస్య ఉన్నా కూడా ఏ శాఖలో సమస్య ఉత్పన్నమవుతుందో ఆ సమస్యకు సంబంధించి అధికారి కచ్చితంగా ప్రజలకు అండగా నిలబడి సమస్య పరిష్కరించాలని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు శాఖల అధికారులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ గుమ్మనూరు నారాయణకు పుట్టినరోజు శుభాకాంక్షలు

**జనసేన మండల కన్వీనర్ కే. చిరంజీవి**

**చిప్పగిరి, మే, 15,( రిపబ్లిక్ న్యూస్)** చిప్పగిరి జనసేన మండల కన్వీనర్ కే. చిరంజీవి శుక్రవారం మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గుమ్మనూరు నారాయణ కు గుంతకల్ నివాసంలో శుభాకాంక్షలు తెలిపారు, కన్వీనర్ మాట్లాడుతూ గుమ్మనూరు నారాయణ అన్న ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని, ఆయన జీవితం అంచెలు అంచలుగా ఎదగాలని మనసారా కోరుకుంటున్నానని తెలిపారు, ఈ కార్యక్రమంలో నంచర్ల శివ, కుందన గుర్తి ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.





# పుట్టపర్తి చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గది

**అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ డిఫెన్స్ ప్రాజెక్టు ఏర్పాటు**

**ఈ ప్రాజెక్ట్ పుట్టపర్తికే కాకుండా, మన దేశ ఏరోస్పేస్ రంగానికే ఒక గేమ్ ఛేంజర్ కాబోతోంది**

**పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి**





**శ్రీ సత్యసాయి ప్రతినిధి, మే 15,(రిపబ్లిక్ న్యూస్):**
పుట్టపర్తి పర్యటనలో భాగంగా ప్రశాంతి నిలయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ తోపాటు విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు, పివిఎన్ మాధవ్, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ప్రజా ప్రతినిధులు, ఆయా సంస్థల ప్రతినిధులు తదితరులు సాయి కుల్వంత్ హాలులో సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

ఈ సందర్భంగా పుట్టపర్తి పరిధిలోని బ్రాహ్మణపల్లి వద్దనున్న సభా వేదికలో గురువారం ప్రతిష్టాత్మకమైన అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏ ఎం సి ఏ) డిఫెన్స్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన కార్యక్రమంలో భాగంగా పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పాల్గొన్నారు.

ఏరోస్పేస్ మ్యాప్‌లో పుట్టపర్తికి ఒక ప్రత్యేక స్థానం

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ డిఫెన్స్ ప్రాజెక్టు ఏర్పాటు.. పుట్టపర్తి చరిత్రలో ఒక సువర్ణాక్షరాలతో లిఖించదగ్గదని పేర్కొన్నారు. భగవాన్ శ్రీ సత్యసాయి బాబా నడయాడిన ఈ పుణ్యస్థలం, ఇకపై కేవలం ఆధ్యాత్మిక కేంద్రం మాత్రమే కాదు, ఒక టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్‌గా మారబోతోందన్నారు.బాబా దూరదృష్టితో ఎన్నో ఏళ్ల క్రితమే ఇక్కడ ఒక ఎయిర్‌పోర్ట్ నిర్మించడం, ఇప్పుడు డిఆర్డిఓ సంస్థ ద్వారా ఇంత గొప్ప ప్రాజెక్ట్ మన రాష్ట్రానికి రావడం చాలా గర్వకారణమన్నారు. ఈ శంకుస్థాపన కార్యక్రమం కేవలం ఒక నిర్మాణం మాత్రమే కాదు, ఇది ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి 'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యాలకు అనుగుణంగా ఉందన్నారు. కేంద్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పుట్టపర్తిలో దాదాపు 650 ఎకరాల్లో డిఆర్డిఓ-ఏడిఏ (ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ) కి సంబంధించిన ఒక తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నాయని,ఇక్కడ 5వ తరం స్వదేశీ స్టెల్త్ ఫైటర్ ప్లేన్స్, అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్‌ల తయారీ జరగబోతోందన్నారు. ఈ ప్రాజెక్ట్ పుట్టపర్తికే కాకుండా, మన దేశ ఏరోస్పేస్ రంగానికే ఒక గేమ్ ఛేంజర్ కాబోతోందన్నారు. దీని వల్ల దాదాపు లక్ష నుండి రెండు లక్షల కోట్ల పైచిలుకు పెట్టుబడులు వచ్చే అవకాశం ఉంది, ఇది ఆర్థికంగా, ఉపాధి పరంగా ఎంతో మేలు చేస్తుందన్నారు. మన సత్యసాయి జిల్లా యువతకు వేలాది సంఖ్యలో స్కిల్డ్, అన్‌స్కిల్డ్ ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, ఏరోస్పేస్ రంగంతో పాటు ఇంజనీరింగ్ సర్వీసెస్, ఆర్.అండ్.డి, లాజిస్టిక్స్, ఐటి, హాస్పిటాలిటీ రంగాల్లో కూడా ఎన్నో అవకాశాలు మెరుగు పడతాయన్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా పుట్టపర్తిలో హాస్పిటాలిటీ, లోకల్ ఎంటర్‌ప్రైజెస్ రంగాలలో గొప్ప మార్పులు రాబోతున్నాయని, ఇంతటి భారీ ప్రాజెక్ట్ పుట్టపర్తికి రావడం వల్ల ఇక్కడి మౌలిక సదుపాయాలు గణనీయంగా మెరుగుపడతాయని పేర్కొన్నారు. ఇది స్వామివారి ఆశీస్సులతో మన పుట్టపర్తికి మరియు సత్యసాయి జిల్లాకు అందిన ఒక గొప్ప వరప్రసాదం అని అన్నారు. భారతదేశ రక్షణ సామర్థ్యాన్ని పెంపొందించడంలోనూ, స్వదేశీ పరిజ్ఞానంతో 5వ తరం స్టెల్త్ ఫైటర్ ప్లేన్స్ తయారీలోనూ మనం స్వయం సమృద్ధి సాధించబోతున్నామన్నారు. కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీ, గ్లోబల్ ఏరోస్పేస్ మ్యాప్‌లో పుట్టపర్తికి ఒక ప్రత్యేక స్థానం లభించబోతోందన్నారు.అతి చిన్న వయసులో తనకు ఈ గొప్ప అవకాశం కల్పించిన పుట్టపర్తి నియోజకవర్గ ప్రజలకు, గత 35 ఏళ్లుగా తన కుటుంబంపై ఆదరాభిమానాలు చూపిస్తున్న అందరికీ పాదాభివందనాలు తెలియజేశారు. ఈ ప్రాజెక్టును మన పుట్టపర్తికి తీసుకువచ్చినందుకు భారత ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ గారికి, ఈ ప్రాజెక్ట్ కోసం ఎన్నో రాష్ట్రాలు పోటీ పడినప్పటికీ ఆంధ్రప్రదేశ్ మీద నమ్మకంతో ఇక్కడికి కేటాయించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారికి, యువనేత, ఐటి మంత్రి నారా లోకేష్ గారికి కృతజ్ఞతలు తెలియజేశారు. యువత కలలను సాకారం చేయడానికి, ఆంధ్రప్రదేశ్ వైపు ఎన్నో పెట్టుబడులు వచ్చేలా కృషి చేస్తున్న మంత్రి నారా లోకేష్ గారికి కోటి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిఆర్డిఓ అధికారులు, సిబ్బంది అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పుట్టపర్తిని భారతదేశపు ఏరోస్పేస్ మరియు డిఫెన్స్ మ్యానుఫ్యాక్చరింగ్ విప్లవానికి కేంద్ర బిందువుగా నిలబెట్టే దిశగా ఈ ప్రయాణం మొదలైందని, ఈ శంకుస్థాపన కేవలం ఒక భవన నిర్మాణం మాత్రమే కాదు, ఇది గౌరవనీయులైన ప్రధాని నరేంద్ర మోదీ గారి 'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మనిర్భర్ భారత్' దార్శనికతకు నిదర్శనం అన్నారు. దీనికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వపు 'ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ పాలసీ 4.0' పూర్తి మద్దతునిస్తోందన్నారు. భారత ప్రభుత్వం మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కలిసి పుట్టపర్తిలో దాదాపు 650 ఎకరాల భూమిని ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ కోసం కేటాయించాయని, డిఆర్డిఓ మరియు ఏడిఏ (ఏ డి ఏ – ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ) ఆధ్వర్యంలో ఈ తయారీ యూనిట్ నడవనుందన్నారు. ఇక్కడ 5వ తరం స్టెల్త్ ఫైటర్ ప్లేన్స్, అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్‌లను స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేస్తారన్నారు. ఇది కేవలం పుట్టపర్తికే కాకుండా, మొత్తం దేశపు ఏరోస్పేస్ పర్యావరణ వ్యవస్థనేమార్చివేసే 'గేమ్ ఛేంజర్' కాబోతోందని పేర్కొన్నారు







## అసాంఘిక కార్యక్రమాల పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలి: ఎస్సై చిన్న రెడ్డప్ప



**చౌడేపల్లి ప్రతినిధి మే 15 రిపబ్లిక్ న్యూస్**
సమాజంలో జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాల పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై చిన్నరెడ్డప్ప అన్నారు. శుక్రవారం స్థానిక బస్టాండ్ లో మహిళలకు మహిళల భద్రత మత్తు పదార్థాల నిర్మూలన పై అవగాహన కల్పించారు. యువతి యువకులు మత్తుకు బానిసలు కాకూడదన్నారు ఎవరైనా అలా మత్తుకు బానిసై గంజాయి వంటి పదార్థాలను తీసుకుంటూ ఉంటే సమీప పోలీస్ స్టేషన్కు తెలియజేయాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు శక్తి యాప్ను ప్రతి మహిళ డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. అపరిచితులు ఇతర ప్రాంతాలలో ఎక్కడైనా సందేహం వస్తే శక్తి యాప్ ద్వారా రక్షింపబడుతారన్నారు. అనంతరం అసాంఘిక కార్యక్రమాలు మహిళల పాత్ర వంటి కార్యక్రమాలపై అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వాహనదారులు రహదారి నిబంధనలు తప్పనిసరి పాటించాలి



**చౌడేపల్లి ప్రతినిధి మే 15 రిపబ్లిక్ న్యూస్** రహదారి నిబంధనలను వాహనదారులు తప్పనిసరిగా పాటించాలని పుంగనూరు రూరల్ సిఐ సాయి ప్రసాద్ అన్నారు. చౌడేపల్లి పుంగనూరు ప్రధాన రహదారిలో వాహనాలను ఆయన తనిఖీ చేశారు వాహనదారులు రికార్డులను సక్రమంగా చూసుకోవాలని లైసెన్స్ కలిగి ఉండాలని అన్నారు. మద్యం సేవించి వాహనాలను నడపరాదన్నారు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు తప్పనిసరిగా ధరించాలన్నారు హెల్మెట్లు వాడకపోవడం వల్ల నిత్యం ప్రమాదాలు సంభవిస్తుండడంతో వారి ప్రాణాలకే ప్రమాదం అన్నారు. రికార్డులు సక్రమంగా లేని లైసెన్సులు కలిగి ఉండని వారికి చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు అనంతరం పలు వాహనాలను తనిఖీ చేసి రికార్డులు సక్రమంగా లేని వాహనాలకు జరిమానాలు విధించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రక్షణ రంగంలో రాయలసీమకు గర్వకారణం

**పుట్టపర్తిలో ఏ ఎం సి ఏ ప్రాజెక్టుకు శంకుస్థాపన**

**దేశ భద్రతకు పుట్టపర్తి కొత్త చిరునామా**

**బ్రహ్మనపల్లిలో భారీ డిఫెన్స్ ప్రాజెక్ట్ ప్రారంభం**

**రూ.15,800 కోట్ల డిఫెన్స్ ప్రాజెక్టుతో పుట్టపర్తి జాతీయ స్థాయిలో మరో మైలురాయి**

**భవిష్యత్ యుద్ధ విమానాల సాంకేతికతకు పుట్టపర్తి కేంద్రబిందువుగా మారనుంది**

**మంత్రి సత్యకుమార్ యాదవ్**





**శ్రీ సత్య సాయి ప్రతినిధి, మే 15,(రిపబ్లిక్ న్యూస్):**
రక్షణ రంగంలో భారతదేశాన్ని మరింత శక్తివంతమైన దేశంగా తీర్చిదిద్దే దిశగా, శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి మరో చారిత్రాత్మక ఘట్టానికి వేదికైంది. దేశ గర్వకారణమైన అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏ ఎం సి ఏ) ప్రాజెక్టుకు సంబంధించిన ఎయిర్ క్రాఫ్ట్ ఇంటిగ్రేషన్, ఫ్లైట్ టెస్ట్ సెంటర్ (ఏ డి ఏ) శంకుస్థాపన కార్యక్రమం శుక్రవారం బ్రహ్మనపల్లి సమీపంలో అత్యంత వైభవంగా జరిగింది. సుమారు రూ.15,800 కోట్ల భారీ పెట్టుబడితో ఏరోనాటికల్ డెవలప్మెంట్ ఏజెన్సీ (ఏ డి ఏ), డీఆర్‌డీఓ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు కానున్న ఈ అత్యాధునిక డిఫెన్స్ ప్రాజెక్టు, భవిష్యత్తులో భారత రక్షణ సామర్థ్యాలను మరింత బలోపేతం చేయనుంది. దేశ భద్రతకు కీలకమైన ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ సాంకేతికత అభివృద్ధిలో ఈ కేంద్రం ప్రధాన పాత్ర పోషించనుంది. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో పాల్గొనడానికి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ , రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం ఉదయం పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకోగా వారికి ఘన స్వాగతం లభించింది.

**పట్టు వైభవాన్ని పరిచయం చేయడం గర్వ కారణం**
ఈ సందర్భంగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ గారిని మర్యాదపూర్వకంగా కలిసి ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ధర్మవరం పట్టు శాలువాతో సత్కరించారు. ధర్మవరం నేతన్నల కళాత్మక నైపుణ్యం, పట్టు వస్త్రాల ప్రత్యేకత, శతాబ్దాల చరిత్ర కలిగిన చేనేత వారసత్వాన్ని కేంద్ర మంత్రికి వివరించారు. దేశ రక్షణ శక్తికి పునాది వేస్తున్న ఈ చారిత్రాత్మక వేదికపై ధర్మవరం పట్టు వైభవాన్ని పరిచయం చేయడం ప్రతి ధర్మవరం వాసికి గర్వకారణమని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. మన నేతన్నల కళ కేవలం వస్త్రం కాదుడ అది ధర్మవరం గౌరవం, ఆత్మగౌరవం అని ఆయన అన్నారు. అనంతరం బ్రహ్మనపల్లిలో నిర్వహించిన శంకుస్థాపన కార్యక్రమంలో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ , ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తదితరులతో కలిసి మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా శ్రీ సత్యసాయి జిల్లా జాతీయ రక్షణ పటంలో కీలక కేంద్రంగా ఎదగనున్నదని, వేలాది మందికి




ప్రత్యక్షపరోక్ష ఉపాధి అవకాశాలు కలగనున్నాయని, రక్షణ అనుబంధ పరిశ్రమలు, టెక్నాలజీ ఆధారిత పరిశ్రమలు వేగంగా అభివృద్ధి చెందనున్నాయని మంత్రి తెలిపారు. భారతదేశ రక్షణ రంగ చరిత్రలో కొత్త అధ్యాయానికి పుట్టపర్తి వేదిక కావడం ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణమని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రానికి భారీ పెట్టుబడులు ఆకర్షితమవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. రాయలసీమ నేలపై రక్షణ రంగ భవిష్యత్తు రూపుదిద్దుకుంటోందిడ ఇది కేవలం ఒక ప్రాజెక్టు కాదు, యువత భవిష్యత్తుకు నూతన దిశ అని మంత్రి సత్యకుమార్ యాదవ్ అభివర్ణించారు.

# బుడగ జంగాలకు ఎస్సీ హోదాపై హర్షం

**రిజర్వేషన్లు 30 శాతానికి పెంచాలని బీఎస్పీ డిమాండ్ -పెట్రోల్ ధరలు తగ్గించాలని కేంద్రానికి విజ్ఞప్తి**

**గుత్తి సంక్షేమం, మే 15,(రిపబ్లిక్ న్యూస్ ):**
బుడగ జంగాలకు ఎస్సీ హోదాపై బీఎస్పీ నాయకులు హర్షంవ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గుత్తి పట్టణంలో బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు.

**ఉన్న 15 శాతం రిజర్వేషన్లను 30 శాతానికి పెంచాలి**

ఈ సందర్భంగా బీఎస్పీ గుంతకల్ ఇన్‌చార్జి విజయ్ బండల రామాంజనేయులు మాట్లాడుతూ బుడగ జంగాలను ఎస్సీ జాబితాలో చేర్చడంపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీలకు ప్రస్తుతం అమలులో ఉన్న 15 శాతం రిజర్వేషన్లను 30 శాతానికి పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సామాజికంగా వెనుకబడిన వర్గాలకు మరింత ప్రాధాన్యం కల్పించేలా



చర్యలు తీసుకోవాలన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు రోజురోజుకూ పెరుగుతూ మధ్యతరగతి ప్రజలపై తీవ్ర భారం మోపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఇంధన ధరలను తగ్గించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ను కోరారు.



## పత్తూరు దంపతుల ప్రథమ వర్ధంతి సందర్భంగా

# అన్న వస్త్ర దాన కార్యక్రమం.



**ఓబులవారిపల్లి మే 15 రిపబ్లిక్ న్యూస్.**
ఓబులవారిపల్లి మండలం పాపిరెడ్డిపల్లి గ్రామం దగ్గరలోని జీవనజ్యోతి ఆనంద నిలయ ఆశ్రమంలో శుక్రవారం కీర్తిశేషులు పత్తూరు నరసింహులు ఆయన సతీమణి నరసమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు పేదలకు అన్నదానం మరియు దుప్పట్లు పంచి పెట్టడం జరిగినది స్త్రీలకు చీరలు పంపిణీ చేయడం కూడా జరిగినది,వారి కుమారులు పత్తూరు చంద్రశేఖర్, పత్తూరు రాజశేఖర్, మరియు కోడళ్ళు మరియు మనవాళ్లు మనవరాలు వారి అల్లుడు వారి కుమార్తె వారి మనవరాలు అల్లుడు హేమాద్రి, కుమార్తె సుజాత మరియు మనవరాలు ప్రత్యేక అన్నదాన కార్యక్రమం వారి చేతుల మీదుగాజీవనజ్యోతి ఆనంద నిలయ ఆశ్రమం లో పంపిణీ చేయడం జరిగినది.

# హత్యాయత్నం కేసులో నిందితుడు అరెస్ట్.

**ఓబులవారిపల్లి మే 15 రిపబ్లిక్ న్యూస్.**
హత్యాయత్నం కేసులో పరారీలో ఉన్న నిందితుడ్ని ఆ శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఓబులవారిపల్లి సబ్ ఇన్స్పెక్టర్ మహేష్ నాయుడు తెలిపారు,వివరాల్లోకి వెళితే ఓబులవారిపల్లి మండలం బాలిరెడ్డిపల్లి పంచాయతీ పరిధిలోని ఇందిరానగర్ గ్రామంలోని నరసింహులు వయసు 62 సంవత్సరాలు, ఆయనపై భూతగాద విషయమై రైల్వే కోడూరు మండలం ఉల్లగట్టు పాడు పంచాయతీ గద్దలవారిపల్లె గ్రామానికి చెందిన గద్దల జయరామయ్య కుమారుడు గద్దల మస్తాన్ అలియాస్ సుల్తాన్ వయసు 33 సంవత్సరాలు భూత గదా విషయమై నరసింహులపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచి హత్యాయత్నానికి పాల్పడి 2025 డిసెంబర్ 21న పరారై తిరుగుతున్నట్లు పోలీసులు తెలియజేశారు ఈ నేపథ్యంలో సదరు ముద్దాయిని సబ్ ఇన్స్పెక్టర్ మహేష్ ఆయన సిబ్బంది ఆచూకీ తెలుసుకొని శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టి రిమాండ్ కు పంపించినట్లు ఎస్ఐ మహేష్ నాయుడు తెలిపారు.




# బోయకొండ గంగమ్మ సేవలో డిఆర్డిఏ పిడి నాగేశ్వరరావు




**చౌడేపల్లి ప్రతినిధి మే 15 రిపబ్లిక్ న్యూస్**
శక్తి స్వరూపిణి శ్రీ బోయకొండ గంగమ్మను అన్నమయ్య జిల్లా డిఆర్డిఏ పిడి నాగేశ్వరరావు కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. వారిని ఆలయ అధికారులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికి అమ్మవారి దర్శన భాగ్యం కల్పించారు. మండపంలో వేద ఆశీర్వాదం, కుంకుమార్చన అమ్మవారి శేష వస్త్రాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికార అర్చక సిబ్బంది పాల్గొన్నారు.

# బాబాయే కీచకుడయ్యాడు

### ఇంటికి చ్చిన బాలికపై పలుమార్లు అత్యాచారం

### కేసు నమోదు చేసిన పోలీసులు..నిందితుడి కోసం గాలింపు



**తిరుపతి మే 15 రిపబ్లిక్ న్యూస్.** కాపాడాల్సిన బాబాయే కీచకుడయ్యాడు. కన్న బిడ్డలా చూసుకోవాల్సిన బాలికపై కామంతో కన్నేశాడు. పర్సనల్ ఫోటోలను అడ్డుపెట్టుకుని.. సోషల్ మీడియాలో షేర్ చేస్తానంటూ బ్లాక్‌మెయిల్ చేసి దారుణానికి ఒడిగట్టాడు. తిరుపతిలో జరిగిన ఈ ఘోరం బాధితురాలి తల్లి ఫిర్యాదుతో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. హైదరాబాద్‌లోని జగద్గిరిగుట్ట పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి.. కేసును తిరుపతి ఈస్ట్ పీఎస్‌కు బదిలీ చేశారు. నిందితుడు రామమూర్తిపై అత్యాచారంతో పాటు ఫోక్సో చట్టం కింద పోలీసులు వేట మొదలు పెట్టారు. సెలవులకని తన ఇంటికి వచ్చిన కూతురు వరుస అయ్యే బాలికపై కన్నేసి కామాంధుడిలా ప్రవర్తించాడు. హైదరాబాద్ కుత్బుల్లాపూర్ పరిధిలోని ప్రాంతానికి చెందిన 16 ఏళ్ల బాలిక ఇంటర్ చదువుతోంది. ఏప్రిల్ నెలలో వేసవి సెలవుల కోసం తిరుపతిలోని తన చిన్నమ్మ ఇంటికి వెళ్ళింది. అక్కడ పిన్ని భర్త రామమూర్తి బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించడం మొదలుపెట్టాడు. ఆమె ఫోన్లో ఉన్న కొన్ని వ్యక్తిగత ఫోటోలను చూసిన నిందితుడు.. వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానని బెదిరించాడు. ఈ ఫోటోలను అడ్డుపెట్టుకుని భయపెడుతూ బాధితురాలిపై రామమూర్తి పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. ఇంటికి వెళ్ళిపోయినా ఫోటోలతో బ్లాక్‌మెయిల్ చేయడం మానలేదు. పరీక్షలు రాసేందుకు హైదరాబాద్ వచ్చిన బాలిక మానసికంగా కృంగిపోవడాన్ని గమనించిన తల్లి.. నిలదీయగా అసలు విషయం బయటపడింది. బాబాయే ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని తెలిసి తల్లి షాక్ తిన్నది. వెంటనే జగద్గిరిగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు ఘటనా స్థలం తిరుపతి కావడంతో 'జీరో ఎఫ్ఐఆర్' నమోదు చేశారు. అనంతరం కేసును తిరుపతి ఈస్ట్ పీఎస్‌కు బదిలీ చేశారు. తిరుపతి పోలీసులు నిందితుడు రామమూర్తిపై కఠిన సెక్షన్లు నమోదు చేశారు. బాధితురాలి శరీరంపై గాయాలు ఉండటంతో ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం నిందితుడు పరారీలో ఉండగా.. పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు.

---------

# సర్ అర్థర్ కాటన్‌కు జగన్ నివాళి




అమరావతి **మే 15 రిపబ్లిక్ న్యూస్.** సర్ ఆర్థర్ కాటన్ జయంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్.. సర్ ఆర్థర్ కాటన్‌కు నివాళి అర్పించారు. ఈ క్రమంలో వ్యవసాయ, నీటిపారుదల రంగానికి ఆయన చేసిన కృషిని ఎప్పటికీ మరువలేమని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ట్విట్టర్ వేదికగా.. 'గోదావరి జిల్లాలు నేడు పచ్చని పంట పొలాలతో అలరారుతున్నాయంటే అందుకు కారణం సర్ ఆర్థర్ కాటన్. సముద్రంలో కలిసిపోతున్న వరద నీటికి అడ్డుకట్ట వేసి రాజమహేంద్రవరం సమీపంలో ధవళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి.. లక్షల ఎకరాలకు సాగునీరు, తాగునీరు అందించిన మహనీయుడు. వ్యవసాయ, నీటిపారుదల రంగానికి ఆయన చేసిన కృషిని ఎప్పటికీ మరువలేం అని' పోస్టు చేశారు. గోదావరి జిల్లాలు నేడు పచ్చని పంట పొలాలతో అలరారుతున్నాయంటే అందుకు కారణం సర్ ఆర్థర్ కాటన్ గారు. సముద్రంలో కలిసిపోతున్న వరద నీటికి అడ్డుకట్ట వేసి రాజమహేంద్రవరం సమీపంలో ధవళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి లక్షల ఎకరాలకు సాగునీరు, తాగునీరు అందించిన మహనీయుడు ఆయన అని కోనియాడారు.

# 26న కేరళంకు నైరుతి పవనాలు

### నాలుగు రోజుల ముందే వచ్చే అవకాశం

### త్వరలో తీవ్రమైన ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం ..ఐఎండీ



**న్యూఢిల్లీ: మే 15 రిపబ్లిక్ న్యూస్.** ఎండలతో అల్లాడిపోతున్న ప్రజలకు చల్లని కబురు అందించింది భారత వాతావరణ శాఖ(ఐఎండీ) . నైరుతి రుతుపవనాలు మే 26న కేరళలో ప్రవేశించే అవకాశం ఉందని అంచనా వేసింది. మే 26న రుతుపవనాలు వచ్చే అవకాశం ఉన్నప్పటికీ, వాతావరణ పరిస్థితుల దృష్ట్యా దీనికి నాలుగు రోజుల అటు ఇటుగా అంటే మే 22 నుంచి మే 30 మధ్య రుతుపవనాలు తాకే అవకాశం ఉండవచ్చని ఐఎండీ వివరించింది. సాధారణంగా కేరళలో రుతుపవనాలు జూన్ 1 నాటికి ప్రవేశిస్తాయి. అక్కడి నుంచి ఉత్తరం వైపునకు విస్తరిస్తూ దేశంలోని మిగిలిన ప్రాంతాలకు చేరతాయి. కేరళలో రుతుపవనాల ప్రవేశం ద్వారా దేశంలో జూన్ నుంచి సెప్టెంబర్ వరకు కొనసాగే వర్షాకాలం అధికారికంగా ప్రారంభమవుతుంది. రుతుపవనాల రాకపై స్పష్టత రావడంతో దేశవ్యాప్తంగా అన్నదాతలు ఖరీఫ్ సాగు పనులకు సిద్ధమవుతున్నారు. కాగా, గతేడాది రుతుపవనాలు మే 24న ప్రవేశించినట్టు ఆ శాఖ వెల్లడించింది.

# డంపింగ్ యార్డ్ ను తక్షణమే తరలించాలి

### పొగను నియంత్రించి, ప్రజలకు ప్రాణాలను కాపాడండి -పి డి ఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి వీరేంద్ర ప్రసాద్



**అనంతపురం ప్రతినిధి, మే 15,(రిపబ్లిక్ న్యూస్):**
ప్రతిరోజు డంపింగ్ యార్డ్ లో పొగ నాలుగు కిలోమీటర్ల మేర వ్యాపించడంతో చుట్టుపక్కల కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, వెంటనే డంపింగ్ యార్డ్ ను వేరొక చోటికి తరలించాలని పి డి ఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి వీరేంద్ర ప్రసాద్ డిమాండ్ చేశారు.శుక్రవారం అనంతపురం నగరంలోని లెక్చరర్స్ కాలనీ రెయిన్బో అపార్ట్మెంట్ దగ్గర ఉన్న ఈశ్వరుని దేవాలయం ఫంక్షన్ హాల్ నందు రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సమావేశానికి సిపిఎం, సిపిఐ(ఎం ఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ, వై ఎస్ ఆర్ సి పి, ఓపిడిఆర్ హక్కుల సంఘం, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి పి డి ఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి వీరేంద్ర ప్రసాద్ అధ్యక్షత వహించగా ముఖ్య వక్తలుగా వై ఎస్ ఆర్ సి పి డిప్యూటీ మేయర్ కోగోటం విజయభాస్కర్ రెడ్డి, రిటైర్డ్ ఆర్ ఐ ఓ కిష్టప్ప, పట్టణ పేదల సంఘం జిల్లా అధ్యక్షుడు వీరనారప్ప, ఉపాధ్యక్షుడు పక్రుద్దీన్, సిపిఎం నాయకులు మసూద్ వలి,ఏఐకేఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి పీ.కిష్ట, ఓ పి డి ఆర్ జిల్లా సహాయ కార్యదర్శి జి సి ప్రకాష్, ఐ ఎఫ్ టి యు జిల్లా కమిటీ సభ్యులు ఎర్రి స్వామి, భారత ప్రజా రైతు సంక్షేమ సంఘం నాయకుల శ్రీనివాస్ రెడ్డి, పిడిఎస్యు విద్యార్థి సంఘం జిల్లా కోశాధికారి బండారు శంకర్, కే ఎన్ పి ఎస్ జిల్లా నాయకులు అనిల్, డిస్కవరీ ఛానల్ అనిల్ కుమార్,ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక నాయకులు టీవీ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

**పొగతో శ్వాసకోశ సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉంది**

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా అనంతపురం నగరం గుత్తి రోడ్డులో ఉన్న డంపింగ్ యార్డ్ కొన్ని లక్షల టన్నుల చెత్తతో పేరుకుపోయి ఉండడంవల్ల చుట్టుపక్కల కాలనీ ప్రజలు దుర్గంధం వాసన వెదజల్లుతోందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కూటమి నాయకులు రాజీవ్ కాలనీ పంచాయతీ పరిధిలోని ప్రజలు డంపింగ్ యార్డ్ ను తొలగించమని అడగడం జరిగింది. అందులో భాగంగారాజకీయ నాయకులు తాము అధికారంలోకి వచ్చిన వెంటనే డంపింగ్ యార్డ్ ని తొలగిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. అయితే ఉన్న చెత్తను బయో మైనింగ్ చేసి రైతులకి, ఫ్యాక్టరీలకు వెసులుబాటు కలిగేలా చేస్తానని చెప్పి రెండు సంవత్సరాల పూర్తి కావస్తున్నా కూడా వాటిని తరలించే పాపాన పోలేదన్నారు.స్వయానా రాష్ట్ర మంత్రి నారాయణ స్వచ్ఛ ఆంధ్ర చైర్మన్ వచ్చి 2026 జనవరి నాటికి డంపింగ్ యార్డ్ ను తరలించి, ఉన్నటువంటి 10 ఎకరాల స్థలాన్ని పార్కుగా తీర్చిదిద్దుతామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. హామీల్లో భాగంగా 2026 మే నెల కావస్తున్న ఇంతవరకు చర్యలు చేపట్టడం లేదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డ్ కు అడపాదడపా చెత్తను తరలించి బయో మైనింగ్ చేస్తున్నారన్నారు. అయితే గత వారం రోజులుగా విపరీతమైన మంటలు వ్యాపించి రాత్రి సమయంలో చుట్టుపక్కల నాలుగు కిలోమీటర్లు ఆ పొగ వల్ల పిల్లల దగ్గర నుంచి పెద్దల వరకు శ్వాసకోశ సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉందని తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.వీటిపై మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులు ఆలోచించి డంపింగ్ యార్డులో వచ్చేటటువంటి మంటలను అదుపు చేయాలని పొగను నియంత్రించాలని అధికారులను హెచ్చరించారు. డంపింగ్ యార్డులో వెలువడే పొగ వల్ల చుట్టుపక్కల కాలనీ ప్రజలు అనేక రోగాల బారిన పడే అవకాశం ఉందని తీవ్ర మనోవేదన వ్యక్తం చేశారు. పొగను ఏంత్రించకుండా నిర్లక్ష్యం చేస్తే సహించబోమని హెచ్చరించారు.రాబోయే రోజుల్లో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించనున్నట్లు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు మున్నా, రాజు కాలనీ యూత్ రవి, నంది, మౌల, వలి, నాగరాజు, రాజు కాలనీ పంచాయతీ వాసులు లెక్చరర్స్ కాలనీ, రెయిన్బో అపార్ట్మెంట్ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటు పాఠశాలలు వద్దు -ప్రభుత్వ పాఠశాలలే ముద్దు

### బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

### జిల్లా కలెక్టర్ ఆనంద్



**అనంతపురం / కనేకల్ ,మే 15,(రిపబ్లిక్ న్యూస్):**
తల్లిదండ్రులు తమ పిల్లల బంగారు భవిష్యత్తు కోసం ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించాలని, అలాగే బడి ఈడు పిల్లలు అందరూ బడిలోనే ఉండాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పిలుపునిచ్చారు. శుక్రవారం కనేకల్ మండల కేంద్రంలోని నేసే పేటఎంపీపీ ఎస్ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కొత్తగా పాఠశాలలో చేరిన పిల్లలతో కాసేపు ముచ్చటించి వారిని ఉత్సాహపరిచారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులకు 2026 విద్యా సంవత్సరం పాఠశాలల ఎన్రోల్మెంట్ డ్రైవ్ లో భాగంగా విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని కలిగించాలని అలాగే ప్రైవేట్ పాఠశాలలు వద్దని ప్రభుత్వ పాఠశాలలే ముద్దని సమాజంలోని ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యత గురించి అవగాహన పెంచాలన్నారు.జిల్లా వ్యాప్తంగా గత సంవత్సరంలో ఎస్ ఎస్ సి ఫలితాలను పోలిస్తే ప్రస్తుతం 70 నుండి 77 శాతం వరకు పెరిగినట్లు కలెక్టర్ తెలిపారు. దీనికి ముఖ్య కారణం ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు, సౌకర్యాల కల్పనే అని తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి ప్రయోజనం పొందుతున్నట్లు పేర్కొన్నారు. రాబోయే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను కనీసం 20 శాతం వరకు పెంచాలని విద్యాశాఖ అధికారులను ఉపాధ్యాయులను జిల్లా కలెక్టర్ సూచించారు. ప్రస్తుతం ఈ లక్ష్యాన్ని సాధించడానికి విద్యాశాఖ ఉపాధ్యాయులు సిఆర్పిలు, మండల విద్యాశాఖ అధికారులు ఎంఈఓ తదితరులు కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. పాఠశాలల అభివృద్ధితో పాటు విద్యార్థుల అడ్మిషన్ల ప్రక్రియను వేగవంతం చేసేందుకు రానున్న ఏడు రోజులపాటు అన్ని ప్రభుత్వ పాఠశాలల అడ్మిషన్ల పై పెద్ద ఎత్తున ప్రచారం, అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించబడుతుందని విద్యాశాఖ తో పాటు మెప్మా డిఆర్ డి ఏ , ఎంపీడీవో తదితర అధికారుల ఆధ్వర్యంలో ప్రతి మండలంలోనూ చురుకుగా ప్రచార కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ లక్ష్యాన్ని విజయవంతం చేయడంలో భాగంగా జిల్లాలోని కుటుంబాలు, తల్లిదండ్రులందరూ తమ వంతు సహకారాలు అందించాలని జిల్లా కలెక్టర్ కోరారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు దుస్తులు (యూనిఫామ్) వంటి అనేక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తున్నట్లు విస్తృతంగా ప్రచారం కల్పించాలన్నారు. మోడల్ ప్రైమరీ స్కూల్స్ జిల్లాలో గత ఏడాది నుంచి సుమారు 600 పాఠశాలలను మోడల్ ప్రైమరీ స్కూల్ గా తీర్చి దిద్దడం జరిగిందని, గతంలో ఇటువంటి పాఠశాలలో అందుబాటులో ఉండేది కావని అందువల్ల తల్లిదండ్రులు తమ పిల్లల బంగారు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సదుపాయాలను సద్వినియం చేసుకొని తమ పిల్లలను కచ్చితంగా ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని జిల్లా కలెక్టర్ కోరారు. గతంలో ఒకరు లేదా ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉండేవారని కానీ ఇప్పుడు ప్రతి పంచాయతీలోని మోడల్ ప్రైమరీ స్కూల్ లో కనీసం ఐదు నుండి ఆరుగురు ఉపాధ్యాయులు అందుబాటులో ఉంటున్నారని అలాగే ప్రతి మోడల్ ప్రైమరీ స్కూల్లో కనీసం 100 నుండి 150 మంది విద్యార్థులు ఉండాలని ప్రతి తరగతికి 30 నుండి 40 మంది పిల్లలు ఉండేలా అడ్మిషన్లు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో డీఎస్సీ ద్వారా ఎంపికైన అత్యంత నైపుణ్యం, అర్హత, అనుభవం కలిగిన ఉపాధ్యాయులను ప్రభుత్వం పాఠశాలలో నియమించి విద్యార్థులకు మంచి విద్యా బోధనలు కల్పిస్తున్నదని ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ విద్య అందించడం జరుగుతోందని అన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఎక్కువ ఫీజులు, ఇతర అదనపు ఖర్చులు ఉంటాయని, కానీ ప్రభుత్వ పాఠశాలలో ఎటువంటి ఫీజులు లేవు, ప్రభుత్వం అనేక సదుపాయాలను ఉచితంగా కల్పిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులకు ఎటువంటి ఆర్థిక భారం లేకుండా తమ పిల్లలకు ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించే అవకాశం ఉన్నందున ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ విద్యా సంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలలలో అడ్మిషన్లు ప్రారంభం అవుతున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థికి నిబంధనల మేరకు తల్లికి వందనం పథకం కూడా వర్తిస్తుందని ప్రభుత్వ పాఠశాలలో ఎన్నో మౌలిక సౌకర్యాలను కల్పించారనీ జిల్లా కలెక్టర్ తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ పలువురి విద్యార్థుల తల్లిదండ్రులను, విద్యార్థులను ఆప్యాయంగా పలకరించి వారితో సెల్ఫీ పాయింట్ ద్వారా ఫోటో సెషన్స్ లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ బ్రహ్మయ్య, ఎంపీడీవో విజయసింహారెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో షేక్షావలి, ఎంఈఓ లక్ష్మయ్య , హెడ్మాస్టర్ వెంకటేష్ పాల్గొన్నారు.

# వాటర్ ప్యాకెట్లపై ఎక్స్‌పైరీ డేట్ ఎందుకు ఉండదు?



వినియోగదారుల ఆరోగ్యంపై పెరుగుతున్న సందేహాలు

ఇన్ని రోజులు మాత్రమే వాడాలి అని మాత్రమే ఉంటుంది

ఎప్పుడు తయారీ అయింది అనే తేదీ ఉండదు

నీటికి ఎక్స్‌పైరీ డేట్ ఉండదా?

గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన అవసరం



**నంద్యాల చీఫ్ క్రైం బ్యూరో, మే 15, (రిపబ్లిక్ న్యూస్):**

రోజువారీ జీవితంలో తాగునీటి ప్యాకెట్లు, బాటిళ్లు విస్తృతంగా ఉపయోగిస్తున్నప్పటికీ, వాటిపై "తయారీ తేదీ", "గడువు తేదీ" కనిపించకపోవడం చాలామందిలో సందేహాలకు దారితీస్తోంది. ముఖ్యంగా వేసవి కాలంలో నీటి వినియోగం పెరిగిన నేపథ్యంలో, "ఈ నీరు ఎంతకాలం సురక్షితం?", "ప్యాకెట్‌పై తేదీలు ఎందుకు లేవు?" అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

### నీటికి ఎక్స్‌పైరీ డేట్ ఉండదా?

సాధారణంగా నీరు సహజ పదార్థం కావడంతో దానికి ప్రత్యేకంగా గడువు తేదీ ఉండదని నిపుణులు చెబుతున్నారు. అయితే నీటిని నిల్వ చేసే ప్లాస్టిక్ ప్యాకెట్ లేదా బాటిల్ నాణ్యత, నిల్వ విధానం, ఉష్ణోగ్రత వంటి అంశాలు నీటి భద్రతను ప్రభావితం చేస్తాయి. ఎక్కువ కాలం వేడిలో ఉంచితే ప్లాస్టిక్‌లోని రసాయనాలు నీటిలో కలిసే ప్రమాదం ఉందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### ఇన్ని రోజులు వాడాలని మాత్రమే ముద్రణ

చాలా కంపెనీలు వాటర్ ప్యాకెట్లపై ఇన్ని రోజులు వాడాలని మాత్రమే ముద్రిస్తుంటాయి. కారణం ప్యాకెట్ నీటిని సాధారణంగా తక్కువ కాలంలో వినియోగిస్తారని భావించడం. ముఖ్యంగా చిన్న వాటర్ ప్యాకెట్లు, బాటిళ్లు ఒకటి లేదా రెండు రోజుల వ్యవధిలోనే అమ్ముడైపోతాయి. అందువల్ల ప్రత్యేకంగా "ఎక్స్‌పైరీ డేట్" ఇవ్వడం చాలా చోట్ల కనిపించదు.

### నిబంధనలు ఏమంటున్నాయి?

భారత ఆహార భద్రత ప్రమాణాల సంస్థ అయిన (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ప్రకారం ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్‌పై తయారీ వివరాలు, బ్యాచ్ నెంబర్, తయారీదారు సమాచారం తప్పనిసరిగా ఉండాలి. అయితే వినియోగ గడువు వివరాలు ఉత్పత్తి రకం, ప్యాకేజింగ్ విధానం ఆధారంగా మారవచ్చు.

### వినియోగదారులు జాగ్రత్తలు తీసుకోవాలి

ఎండలో ఎక్కువసేపు ఉంచిన వాటర్ ప్యాకెట్లు కొనకూడదు. ప్యాకెట్ ఉబ్బిపోయి ఉంటే ఉపయోగించకూడదు. సీల్ తెరచి ఉంటే వెంటనే పారేయాలి. తయారీ తేదీ చూసి తాజా ప్యాకెట్ మాత్రమే కొనాలి. శుభ్రమైన ప్రదేశంలో నిల్వ చేసిన నీటినే వినియోగించాలి

### గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన అవసరం

గ్రామాలు, చిన్న పట్టణాల్లో తక్కువ ధరకు అమ్మే వాటర్ ప్యాకెట్లపై సరైన వివరాలు లేకపోవడం సాధారణంగా కనిపిస్తోంది. నాణ్యత లేని నీరు ఆరోగ్య సమస్యలకు దారితీసే అవకాశం ఉండటంతో అధికారుల తనిఖీలు పెరగాలని ప్రజలు కోరుతున్నారు. నీటికి స్వతంత్రంగా ఎక్స్‌పైరీ డేట్ లేకపోయినా, దాని ప్యాకేజింగ్, నిల్వ పరిస్థితుల వల్ల నాణ్యత మారే అవకాశం ఉంది. అందుకే వినియోగదారులు జాగ్రత్తగా పరిశీలించి, విశ్వసనీయ బ్రాండ్ల నీటినే వినియోగించడం ఆరోగ్యానికి మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

# గడువులోగా జనన గణన పూర్తి చేయాలి

## : కలెక్టర్ రాజకుమారి

జనన గణన పనుల్లో జాప్యానికి తావులేదు -క్షేత్రస్థాయిలో పర్యటించి ఎన్యూమరేషన్ వేగవంతం చేయండి

ఈనెల 19 నాటికి వంద శాతం పూర్తి చేయాలి



**నంద్యాల బ్యూరో, మే 15 (రిపబ్లిక్ న్యూస్)**

జిల్లాలో జరుగుతున్న జనన గణన (ఎన్యూమరేషన్) ప్రక్రియను వేగవంతంగా, ఖచ్చితత్వంతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయం నుండి మండల తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో జనన గణన పురోగతిపై టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో చేపట్టిన జనన గణన ప్రక్రియను ఈనెల 19వ తేదీలోగా వంద శాతం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈనెల 16వ తేదీ నాటికి 80 శాతం జనన గణన పనులు పూర్తి కావాలన్నారు. తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో స్వయంగా పర్యటిస్తూ పనులను పర్యవేక్షించాలని సూచించారు. ఎన్యూమరేటర్ల పనితీరును నిరంతరం సమీక్షిస్తూ, ఎక్కడైనా జాప్యం లేదా లోపాలు కనిపిస్తే వెంటనే సరిదిద్దే చర్యలు తీసుకోవాలని తెలిపారు. జనన గణన ప్రక్రియను సమయపాలనతో, పారదర్శకంగా పూర్తి చేయడం ప్రతి అధికారి బాధ్యత అని కలెక్టర్, పేర్కొన్నారు. నిర్లక్ష్యానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఉండకూడదన్నారు. జిల్లాలో హెచ్ఎల్‌బీ (హౌస్ లిస్టింగ్ బ్లాక్) పనుల అమలులో బేతంచెర్ల, డోన్ అర్బన్ మరియు రూరల్, బనగానపల్లె మండలాలు, అలాగే బేతంచెర్ల నగర పంచాయతీ ప్రాంతాలు పనితీరులో వెనుకబడి ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. సంబంధిత అధికారులు పనితీరును మెరుగుపరుచుకుని క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే హెచ్ఎల్‌బీ పనుల ప్రాముఖ్యతపై ప్రజల్లో పూర్తి స్థాయి అవగాహన కల్పించాలని, ప్రజల సహకారంతోనే జనన గణన ప్రక్రియ విజయవంతమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.

# రైతులకు నాణ్యమైన ఎరువులు అందేలా చర్యలు

కల్లూరులో ఫర్టిలైజర్ దుకాణాలపై జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ ఆకస్మిక తనిఖీలు





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మే 15)** రైతులకు ప్రభుత్వ నిర్ణయించిన ధరలకే నాణ్యమైన ఎరువులు అందుతున్నాయా అనే అంశంపై జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ కల్లూరు మండలంలోని ఫర్టిలైజర్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.కల్లూరు న్యూ బస్టాండ్ వద్ద ఉన్న పరమేశ్వర ఏజెన్సీతో పాటు లక్ష్మీపురం గ్రామంలోని రాజ్యలక్ష్మి పెస్టిసైడ్స్ అండ్ ఫర్టిలైజర్స్ దుకాణాలను సందర్శించిన జాయింట్ కలెక్టర్, యూరియా ఎరువుల నిల్వలు, విక్రయాల వివరాలు, స్టాక్ రిజిస్టర్లు, కొనుగోలుఅమ్మకాల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు.అలాగే ఎరువులను నిర్ణయించిన ధరలకు విక్రయిస్తున్నారా, ఎక్కడైనా అక్రమ నిల్వలు లేదా అధిక ధరలకు విక్రయాలు జరుగుతున్నాయా అనే అంశాలపై ఆరా తీశారు. స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేసి పారదర్శకంగా నిర్వహించాలని దుకాణ నిర్వాహకులకు సూచించారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎరువుల సరఫరా సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయులు, మండల వ్యవసాయ శాఖ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# జీఎస్టీ బకాయిదారులపై కఠిన చర్యలు తీసుకోండి

## : జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి

పన్ను ఎగవేతకు అడ్డుకట్ట వేయాలని అధికారులకు ఆదేశాలు

బ్యాంక్ ఖాతాల ఫ్రీజ్, ఆస్తుల జప్తు చర్యలు వేగవంతం






**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మే 15)**

పన్ను చెల్లింపు దారులు సక్రమంగా జీఎస్టీ చెల్లించేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి అధికారులను ఆదేశించారు. పన్నుల వసూళ్లలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు కొనసాగించాలని స్పష్టం చేశారు.

కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో వాణిజ్య పన్నుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జీఎస్టీ కోఆర్డినేషన్ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాకు రావాల్సిన ఆదాయ మార్గాలను బలోపేతం చేయడంతో పాటు పన్ను వసూళ్లలో పారదర్శకత పెంచాలని సూచించారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన జీఎస్టీ ఆదాయ లక్ష్యాలను తప్పనిసరిగా సాధించాలని అధికారులను ఆదేశించారు.

జీఎస్టీ బకాయిదారుల పాన్ నంబర్లకు అనుసంధానమైన అన్ని బ్యాంకు ఖాతాల వివరాలను సేకరించి వెంటనే ఫ్రీజ్ చేయాలని ఎల్‌డిఎంను కలెక్టర్ ఆదేశించారు. బకాయిల వసూళ్లలో భాగంగా ఆర్.ఆర్. యాక్ట్ కింద వేలం ప్రక్రియ చేపట్టే సమయంలో పోలీస్ శాఖ తగిన సహకారం అందించాలని సూచించారు.

బకాయిదారుల నిషేధిత ఆస్తుల జాబితాను సేకరించి రిజిస్ట్రేషన్ శాఖ రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు. అలాగే పీఆర్, ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, ఏపీఎంఎస్ఐడీసీ శాఖల కాంట్రాక్టర్లు క్రమం తప్పకుండా పన్నులు చెల్లిస్తున్నారా లేదా అన్న అంశంపై డేటా సేకరించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాంప్లెక్స్‌లలో షాపులు అద్దెకు తీసుకున్న వారు ట్యాక్స్ చెల్లిస్తున్నారా అనే అంశాన్ని పరిశీలించాలని పేర్కొన్నారు. పన్నులు సక్రమంగా చెల్లించని వారిపై భారీ జరిమానాలు విధించే అవకాశముందని హెచ్చరించారు.

ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల వివరాలు, వారు వృత్తి పన్ను చెల్లిస్తున్నారా లేదా అన్న సమాచారం సేకరించాలని డీఈఓను ఆదేశించారు. అలాగే డాక్టర్లు, డయాగ్నస్టిక్ ల్యాబ్‌లు పన్నులు చెల్లిస్తున్నారా అనే అంశాన్ని కమర్షియల్ ట్యాక్స్ అధికారులు ప్రత్యేకంగా పరిశీలించాలని సూచించారు.

ఈ సమావేశంలో కమర్షియల్ టాక్స్ జాయింట్ కమిషనర్ నీరజ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, పరిశ్రమల శాఖ జీఎం అశోక్ కుమార్, జిల్లా పరిషత్ సీఈఓ రమణ రెడ్డి, డీఎస్ఓ రాజా రఘువీర్, ఎల్‌డిఎమ్ మోహన్, డీఈఓ సుధాకర్, సర్వ శిక్ష అభియాన్ పీఓ లోకరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# కుక్క నోట మనిషి కాలు!

విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో ఘోరం...

రోగి కాలుకు ఇన్‌ఫెక్షన్ సోకడంతో తొలగింపు

బయోవేస్ట్‌లో తరలించేందుకు సంచిలో పెట్టి వృద్ధాల గదిలో ఉంచిన సిబ్బంది

తొలగించిన కాలును నోట కరుచుకు వెళ్లిన కుక్క

**విజయవాడ మే 15 రిపబ్లిక్ న్యూస్.**




విజయవాడ కొత్త ప్రభుత్వాసుపత్రిలో దారుణం జరిగింది. ఓ వ్యక్తికి ఇన్‌ఫెక్షన్ సోకి తొలగించిన కాలును ఒక కుక్క నోట కరుచుకు వెళ్ళింది. వైద్యుల నిర్లక్ష్యమే దీనికి కారణమని ఆరోపణలు వస్తున్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు, ఒక రోగికి ఇన్‌ఫెక్షన్ సోకడంతో కాలును తొలగించారు. తొలగించిన కాలును బయో వేస్ట్‌లో భాగంగా తరలించేందుకు ఒక సంచిలో పెట్టి ఆసుపత్రి మొదటి అంతస్తులోని వ్యర్థాల గదిలో ఉంచారు.బయోవేస్ట్‌ను తరలించే 'సేఫ్' వాహనం, మున్సిపల్ కార్పొరేషన్ వాహనాలు మూడు రోజులకు ఒకసారి వస్తాయి. దీంతో తొలగించిన కాలును వ్యర్థాల గదిలో ఉంచారు. ఈ గదిలో భద్రతా ప్రామాణాలు పాటించకపోవడంతో ఒక కుక్క కాలును నోట కరుచుకు వెళ్ళింది. తలుపులు సరిగా మూసి ఉంచకపోవడంతో ఈ ఘటన చోటు చేసుకున్నట్లు భావిస్తున్నారు.

ఆసుపత్రి ఆవరణలోకి ప్రవేశించిన ఒక కుక్క నేరుగా మొదటి అంతస్తులోని వ్యర్థాల గదిలోకి వెళ్ళింది. అక్కడ ఉన్న సంచిని నోట కరిచి బయటకు పరుగు తీసింది. ఆసుపత్రి వెలుపల కొంతదూరంలో కుక్క ఆ కాలులో కొంత భాగాన్ని పీక్కుని తిన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనకు ఆసుపత్రి సిబ్బంది, భద్రతా సిబ్బంది నిర్లక్ష్యమే ప్రధాన కారణమని ఆరోపణలు వస్తున్నాయి. ఇదిలా ఉండగా, ఘటన వెలుగులోకి రావడంతో ఆసుపత్రి సిబ్బంది వెంటనే కుక్కను వెంబడించి దూరంగా పడేసిన కాలి భాగాన్ని తిరిగి స్వాధీనం చేసుకున్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

ప్రతి శుక్రవారం నియోజకవర్గ స్థాయిలో పీజీఆర్ఎస్

పాణ్యం నియోజకవర్గంలో తొలి ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహణ 300కు పైగా అర్జీలు స్వీకరణ

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మే 15)**

ప్రజల సమస్యలను స్థానికంగానే వేగంగా పరిష్కరించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం నియోజకవర్గ స్థాయిలో "పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్)" కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రజల వినతులను స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

పాణ్యం నియోజకవర్గంలోని కల్లూరు మండలం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతిపత్రాలు స్వీకరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను శ్రద్ధగా విని సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లాలో ప్రతి శుక్రవారం నియోజకవర్గ స్థాయిలో పీజీఆర్ఎస్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి మండలంలో ఈ కార్యక్రమం కొనసాగుతుందని, ప్రజలు జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే సమస్యలను పరిష్కరించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు.






ప్రజలకు అధికారులు స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలని, సమస్య పరిష్కారం సాధ్యమైతే వెంటనే చర్యలు తీసుకోవాలని, సాధ్యం కాకపోతే కారణాలను పారదర్శకంగా వివరించాలని కలెక్టర్ సూచించారు. ఇలా చేయడం ద్వారా ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం తగ్గడంతో పాటు మధ్యవర్తుల మోసాలకు కూడా అడ్డుకట్ట పడుతుందని తెలిపారు. రోడ్లు, వంతెనలు, భారీ అభివృద్ధి పనులు వంటి అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బడ్జెట్ మంజూరైన వెంటనే అమలు చేస్తామని చెప్పారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. ప్రతి సోమవారం జిల్లా, మండల స్థాయిలో నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమాలకు తోడు ప్రతి శుక్రవారం నియోజకవర్గ స్థాయిలో పీజీఆర్ఎస్ నిర్వహించడం ద్వారా ప్రజలకు మరింత చేరువవుతున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి సమస్యల సంఖ్యపై కాకుండా, ఎన్ని సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారం అయ్యాయనే అంశంపైనే సమీక్ష చేస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల సమస్యలను బాధ్యతగా తీసుకొని పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు.పాణ్యం నియోజకవర్గంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 300కు పైగా అర్జీలు అందాయని ఎమ్మెల్యే తెలిపారు. కాలనీలు, డ్రైనేజీ, తాగునీరు, రహదారులు, పెన్షన్లు, రెవెన్యూ మరియు ఆన్‌లైన్ నమోదు సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారని చెప్పారు. వచ్చే శుక్రవారం కూడా ఇదే విధంగా పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, ఆర్డీవో అనురాధ, మున్సిపల్ కమిషనర్ చల్ల ఓబులేసు, జెడ్పీ సీఈఓ రమణారెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com